**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 92, పేజీలు - 08

గురువారం,అక్టోబర్ 01, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD





## సిరిసిల్లలో గెలిపిస్తే

# ఢిల్లీని ఒప్పించి మంత్రిని చేస్తా

- రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ.1,700 కోట్ల నిధులు మంజూరు
- రూ.345.78 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- బతుకమ్మ చీరలపై కమీషన్ల ఆరోపణలు, దళితుల అంశంలో బీఆర్ఎస్‌పై విమర్శలు
- సిరిసిల్ల గడిని నేలమట్టం చేద్దాం - ఇదే మన ప్రతిజ్ఞ అన్న సీఎం రేవంత్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రానున్న ఎన్నికలలో సిరిసిల్లలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ఢిల్లీ హై కమాండ్ ను ఒప్పించి మంత్రివర్గంలోకి తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. సిరిసిల్ల పర్యటనలో భాగంగా జూనియర్ కళాశాల మైదానంలోని హెలిపాడ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, ఎస్పీ జి. మహేష్ బాబాసాహెబ్ ఘన స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా నుంచి సభా ప్రాంగణం వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్ర నిర్వహించారు.సిరిసిల్లలో చేనేత, పవర్లూమ్ వస్త్ర ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న నేత బజారు నిర్మాణ పనులకు, సిరిసిల్ల, వేములవాడలో రూ.200 కోట్ల చొప్పున నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణ పనులకు, వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా రూ.99.40 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో..

## పేదలకు ఇళ్ల పట్టాలే

# స్వర్ణాంధ్రకు తొలి అడుగు

### 'పేదలకు పట్టాభిషేకం' బహిరంగ సభలో సీఎం చంద్రబాబు

- విజయవాడలో 26,401 పేద కుటుంబాలకు ఇంటి పట్టాల పంపిణీ - రూ.28,112 కోట్ల విలువైన భూములపై హక్కులు కల్పించిన ప్రభుత్వం
- పేదల ఆత్మగౌరవానికి ఇది పట్టాభిషేకం అని పేర్కొన్న సీఎం చంద్రబాబు - అభివృద్ధికి గొడ్డలి పార్టీ అడ్డుపడుతోందని తీవ్ర విమర్శలు

అమరావతి (ప్రశ్న న్యూస్) కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతోందని, డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రంలో అభివృద్ధి జెట్ స్పీడ్‌తో పరుగులు పెడుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ, విజయవాడలో 26,401 పేద కుటుంబాలకు ఆయన ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. సోమవారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో 'పేదలకు పట్టాభిషేకం' పేరిట నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "విశాఖపట్నంలో 28 వేల మందికి, మంగళగిరిలో 5,800 కుటుంబాలకు ఇప్పటికే పట్టాలు అందజేశాం. ఇప్పుడు విజయవాడలో 26,401 కుటుంబాలకు రూ.28,112 కోట్ల విలువైన 707 ఎకరాల

2లో..



# పంటలకు మద్దతు ధర పెంపు

### - రైతులకు శుభవార్త చెప్పిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో రైతులకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రబీ పంటల మద్దతు ధర పెంపు ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. గోధుమలు, పప్పు ధాన్యాలకు మద్దతు ధరను పెంచింది. గోధుమలకు మద్దతు ధర రూ.2,610లకు, శెనగలకు రూ.5,958లకు పెంచింది.



2లో..

## పేరు కొత్తైనా..

# విధానం, నాయకత్వం మారదు

### - కేటీఆర్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్

- తెలుగు గడ్డపై పుట్టిన పార్టీ జాతీయ స్థాయికి ఎందుకు విస్తరించకూడదన్న కేటీఆర్
- నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే షారుఖ్ అవుతానా? అని ప్రశ్న
- తదుపరి తెలంగాణ సీఎం కేసీఆర్ అని ధీమా

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై తెలంగాణ రాజకీయాల్లో ఇప్పటి నుంచే చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి. తాను ముఖ్యమంత్రి అభ్యర్థిని కాదని మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తన తండ్రి, పార్టీ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని కేటీఆర్ స్పష్టం చేశారు. కొచ్చిలో జరిగిన ఓ కాన్క్లేవ్ లో ఆయన తెలంగాణ రాజకీయాలు, బీఆర్ఎస్ భవిష్యత్తు, బీజేపీతో పొత్తు, డీలిమిటేషన్, ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాలపై మాట్లాడారు. తాను ప్రధాన రాజకీయ పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా



2లో..

## తాడేపల్లి హుకుం..

# క్షేత్రస్థాయిలో నైరాశ్యం!

### - వైఎస్సార్‌సీపీలో రాజకీయ సంక్షోభం కనిపిస్తోందా?



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి కూటమి ప్రభుత్వం సమాయత్తమవుతున్న వేళ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అంతర్మథనం, నైరాశ్యం కనిపిస్తున్నాయి. తాడేపల్లి క్యాంప్ ఆఫీస్ వేదికగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రీజనల్ కోఆర్డినేటర్లు, సీనియర్ నేతలతో వరుస సమీక్షలు నిర్వహిస్తూ ప్రతి వార్డు, పంచాయతీ, నియోజకవర్గంలోనూ అభ్యర్థులను దింపి గట్టిగా పోరాడాల్సిందే అని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు. అయితే, అధినేత ఇస్తున్న ఆదేశాలకు, క్షేత్రస్థాయిలోని కఠిన వాస్తవాలకు మధ్య ఏమాత్రం పొంతన కుదరడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**తాడేపల్లి హుకుం వర్సస్ క్షేత్రస్థాయి నెగెటివిటీ**

అధికారం కోల్పోయిన నాటి నుంచి వైఎస్సార్‌సీపీ తీవ్ర రాజకీయ ఒత్తిడిని ఎదుర్కొంటోంది. సార్వత్రిక ఎన్నికల ఓటమి షాక్ నుంచి పార్టీ క్యాడర్ ఇంకా తేరుకోకముందే

2లో..




# సిరిసిల్లలో గెలిపిస్తే ఢిల్లీని ఒప్పించి మంత్రిని చేస్తా

శంకుస్థాపన చేశారు. అదేవిధంగా సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాలు, తంగళ్లపల్లి, వీర్నపల్లి, వేములవాడ రూరల్, రుద్రంగి మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలు, వేములవాడలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణ పనులకు, రుద్రంగిలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించనున్న గోదాములు, అనుబంధ యూనిట్ల నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులతో కలిసి శంకుస్థాపన చేశారు. పెద్దూరులో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనాన్ని, వేములవాడలో మహిళా పోలీస్ స్టేషన్‌ను, వేములవాడ, సిరిసిల్లలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.అనంతరం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ధైర్యం, దైవం కలిసి వెలిసిన ప్రాంతం సిరిసిల్ల అని అన్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో దైవచింతనతో పాటు, తమ పూర్వీకులు నిజాం రజాకార్లపై చేసిన వీరోచిత పోరాటానికి సిరిసిల్ల ప్రజలు వారసులని అన్నారు.సిరిసిల్ల అంటే సిరులకు నిలయమని, అయితే పదేళ్ల టీఆర్ఎస్ హయాంలో సిరిసిల్ల ఉరిసిల్లగా మారిందని అన్నారు. మనిషి నాగరికతకు మొదటి అడుగు వస్త్రమని, వస్త్ర పరిశ్రమకు అసలైన చిరునామా సిరిసిల్ల అని పేర్కొన్నారు. వేలాది కుటుంబాలు వస్త్ర పరిశ్రమను నమ్ముకుని జీవనం సాగిస్తున్నాయని, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన చీరలు, అగ్గిపెట్టెలో పెట్టగలిగేంత సన్నని చీరలను తయారు చేసే నైపుణ్యం ఇక్కడి చేనేత కార్మికుల సొంతమని అన్నారు.2009 నుంచి 2023 వరకు అరడజను సార్లు జరిగిన ఎన్నికల్లో కేటీఆర్ గెలిచినప్పటికీ చేనేత కార్మికుల ఆత్మహత్యలను ఎందుకు ఆపలేదని, కార్మికుల గల్ఫ్ వలసలు ఎందుకు ఆగలేదని ప్రజలు ఆలోచించాలని అన్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్లిన కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినప్పుడు కనీసం వారి మృతదేహాలను స్వస్థలాలకు తీసుకురాలేని పరిస్థితి గత పాలనలో ఉండేదని అన్నారు.గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక పాలసీ రూపొందించాలని స్థానిక నాయకులు కోరగా, విదేశాల్లో ప్రమాదవశాత్తు కార్మికులు మరణిస్తే మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురావడంతో పాటు సంబంధిత కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించేలా ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ముఖ్యమంత్రి తెలిపారు.2004, 2006, 2008 సంవత్సరాల్లో మూడుసార్లు కరీంనగర్ జిల్లా ప్రజలు కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించినప్పటికీ 2009లో కేసీఆర్ పాలమూరుకు వలస వెళ్లారని అన్నారు. గత పాలకులపై అవినీతి ఆరోపణలు చేస్తూ, కల్వకుంట్ల కుటుంబం లక్ష కోట్ల అవినీతికి పాల్పడిందని ముఖ్యమంత్రి ఆరోపించారు. అమెరికాలో ఎన్ని బాత్రూంలు కడిగారో, వేల కోట్లు ఎలా సంపాదించారో కేటీఆర్ వెల్లడించాలని అన్నారు.గోదావరి జలాలను అడ్డం పెట్టుకుని మానేరు ఇసుకను దోచుకున్నారని ఆరోపిస్తూ, నేరెళ్ల బాధితులు ఇందుకు సజీవ సాక్ష్యమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్‌ను ఇక్కడికి తీసుకువస్తే పోలీసులు నిర్బంధించిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు.మిడ్‌మానేరు డ్యాం ముంపులో ఇళ్లు కోల్పోయిన కేసీఆర్ కుటుంబ సభ్యులు ఇళ్ల స్థలాలు పొందలేదా అని ప్రశ్నించారు. సిరిసిల్ల ప్రజల ఓట్లు కేటీఆర్‌కు పచ్చనోట్లుగా మారాయని ఆరోపించారు. వేములవాడ శివయ్య, భద్రాచలం రామయ్యను మోసం చేసిన వ్యక్తి కేసీఆర్ ఒక్కరేనని అన్నారు. వెయ్యి రోజుల ప్రజాపాలనలో నేత కార్మికుల కోసం రూ.1,741 కోట్లు ఖర్చు చేశామని, రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ.1,700 కోట్ల నిధులు మంజూరు చేశామని తెలిపారు. వేములవాడలో నూలు డిపో ఏర్పాటు చేశామని, వేములవాడ ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని అన్నారు.ఎమ్మార్వో కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, మహిళా పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సిరిసిల్లలో మార్పు రాబోతోందని, ప్రజల కలలో ఆనందం కనిపిస్తుందని అన్నారు. రాబోయే శాసనమండలి ఎన్నికల్లో ఒక పద్మశాలి బిడ్డను శాసనమండలికి పంపించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో సిరిసిల్లలో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన అభ్యర్థికి మంత్రి వర్గంలో స్థానం కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.మానేరు నదిపై నిర్మించిన చెక్‌డ్యాంలు కొట్టుకుపోయి కేసీఆర్ ఇంట్లో నోట్ల కట్టలుగా తేలాయని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీలు 9, 10, 11, 12 పూర్తి చేయకుండా పెండింగ్‌లో పెట్టడం వల్ల ఇక్కడి రైతులకు గోదావరి జలాలు చేరలేదని అన్నారు. కుటుంబ పాలన కావాలో, ప్రజాపాలన కావాలో ప్రజలు ఆలోచించుకోవాలని అన్నారు. గత పాలకులు పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టించారా అని ప్రశ్నించారు. పదేళ్ల సమయం పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించేందుకు సరిపోలేదా అని అన్నారు. గత పాలకులు పేదలకు రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని, బతుకమ్మ చీరల్లో కమిషన్లు కొట్టేశారని ఆరోపించారు.బతుకమ్మ చీరలకు సంబంధించిన రూ.350 కోట్ల బకాయిలను ప్రజా ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం వంటి పథకాలను గత పాలకులు అమలు చేయలేదని అన్నారు. ప్రస్తుతం కోటి ఆరు లక్షల కుటుంబాలకు చెందిన 3 కోట్ల 46 లక్షల మంది లబ్ధిదారులకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారని, మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ప్రభుత్వం రూ.12 వేల కోట్లు చెల్లించిందని అన్నారు. ఈ పండుగకు ప్రభుత్వం చిలక చీరలను పంపిణీ చేస్తుందని తెలిపారు.రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు, రుణమాఫీ కింద రూ.20,614 కోట్లు రైతులకు చెల్లించామని తెలిపారు. 75 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని, రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించామని తెలిపారు. నేటి పాలకుల్లో శ్రీకాంతాచారి తల్లిని మహిళా కమిషన్ సభ్యురాలిగా, చాకలి ఐలమ్మ కుటుంబ సభ్యులను మహిళా కమిషన్ సభ్యులుగా నియమించామని ముఖ్యమంత్రి తెలిపారు. అనంతరం నేరెళ్ల బాధితులకు 10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం చెక్కు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కు జిల్లా కలెక్టర్ జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక సలహాదారులు సుదర్శన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేముల నరేందర్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, మదన్‌మోహన్ రావు, లక్ష్మీకాంతారావు, డాక్టర్ సంజయ్, శ్రీగణేష్, నాగరాజు, కుంభం అనిల్ రెడ్డి, నవీన్ యాదవ్, సంపత్ కుమార్, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, మంత్రులు, ప్రభుత్వ విప్‌లు, వివిధ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలి

- సీఎం రేవంత్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టీకరణ
- నేతలను కులం కోణంలో చూడకూడదని వ్యాఖ్య
- గ్యారెంటీ పథకాలు ఉచితాలు కావన్న డిప్యూటీ సీఎం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఓ కాన్‌క్లేవ్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు.ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు గుప్పించారు. పన్నుల వాటాలో తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

# పేదలకు ఇళ్ల పట్టాలే స్వర్ణాంధ్రకు తొలి అడుగు

భూములపై పూర్తి హక్కులు కల్పిస్తున్నాం. ఇది పేదల ఆత్మగౌరవానికి మా ప్రభుత్వం చేస్తున్న పట్టాభిషేకం" అని పేర్కొన్నారు. ఇప్పటివరకు మొత్తం 60 వేల కుటుంబాలకు రూ.52 వేల కోట్ల విలువైన భూములను అందించడాన్ని తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

## గొడ్డలి పార్టీ అంటూ తీవ్ర విమర్శలు

గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "2019-24 మధ్య పాలకులు ప్రతి ఇంట్లో ఆస్తుల వివాదాలు సృష్టించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో ప్రజలను భయాందోళనకు గురిచేశారు. సర్వే రాళ్లపై తమ బొమ్మలు ముద్రించుకోవడం కోసం రూ.800 కోట్ల ప్రజా ధనాన్ని వృథా చేశారు. ఇప్పుడు మేము రాజముద్రతో కూడిన వివాదరహిత పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నాం" అని వెల్లడించారు. పురాణాల్లో యజ్ఞాలకు రాక్షసులు అడ్డుపడినట్లు, తాము చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనికి గొడ్డలి పార్టీ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. అమరావతి నిర్మాణాన్ని అడ్డుకునేందుకు ప్రపంచ బ్యాంకుకు లేఖలు రాయడం, చెరకు తోటలను తగలబెట్టడం వంటి చర్యలకు పాల్పడ్డారని మండిపడ్డారు.

## అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి తమ ప్రభుత్వానికి రెండు కళ్లని చంద్రబాబు పునరుద్ఘాటించారు. "పట్టిసీమను అడ్డుకోవాలని చూసినా, పట్టుదలతో పూర్తి చేసి కృష్ణా డెల్టాకు నీరందించాం. వచ్చే ఏడాది నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేస్తాం. అలాగే రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను మూడేళ్ల కాలంలో పూర్తి చేస్తాం" అని హామీ ఇచ్చారు. మహిళా సాధికారతలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని, కేంద్ర గణాంకాల ప్రకారం విమెన్ వర్క్ ఫోర్సులో విశాఖపట్నం, విజయవాడ నగరాలు దేశంలోనే అగ్రస్థానంలో నిలిచాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు.పేదలందరికీ సొంత ఇల్లు, ఇంటి స్థలం, కుళాయి కనెక్షన్ అందించడమే కూటమి ప్రభుత్వ అంతిమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా సాగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని లబ్ధిదారులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పంటలకు మద్దతు ధర పెంపు

అలాగే, క్లీన్ ఎనర్జీ ప్రోత్సాహానికి పీఎం ధార పథకం కోసం రూ.1,84,650 కోట్లు, ఢిల్లీలో ఐటీఎంఎస్‌కు రూ.1,705 కోట్లను కేటాయించింది. పీఎం ధార పథకం ద్వారా 2030 నాటికి 500 గిగావాట్ల క్లీన్ ఎనర్జీ, 2035 నాటికి 900 మెగావాట్ల ఉత్పత్తి సాధనే లక్ష్యంగా పెట్టుకుంది. రైతులు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర పొందేలా కేంద్ర ప్రభుత్వం 2027-28 మార్కెటింగ్ సీజన్ కోసం రబీ పంటల కనీస మద్దతు ధరలను (ఎంఎస్పి) పెంచింది. వీటిలో అత్యధికంగా కుసుమ పంటకు క్వింటాల్‌కు రూ.675 పెంచగా ఆ తర్వాత ఆవాలకు క్వింటాల్‌కు రూ.413 చొప్పున పెంచారు. కందిపప్పు, బార్లీ, శనగ, గోధుమ పంటలకు వరుసగా క్వింటాల్‌కు రూ.390, రూ.136, రూ.83, రూ.25 చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.ప్రస్తుతం గోధుమలు క్వింటాల్‌కు రూ.2,585 ఉండగా తాజా పెంపుతో రూ.2,610కి చేరుతుంది. అలాగే, బార్లీ క్వింటాల్ రూ.2,150 ఉండగా రూ.136 పెంచడంతో రూ.2,286 లభిస్తుంది. శెనగలు రూ.5,875 ఉండగా రూ.83 పెంచడంతో క్వింటాల్ రూ.5,958కు చేరుతుంది. కందిపప్పు రూ.390 పెంచడంతో క్వింటాల్ 7,390కి చేరుకోగా ఆవాలకు రూ.413 పెంచడంతో క్వింటాల్ కనీస ధర రూ.6,613కు చేరింది. కుసుమ గింజలకు మద్దతు ధరను రూ.675 మేర పెంచడంతో రూ.7,215కు చేరింది. రబీ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పి) పెంపు, దేశీయ సగటు ఉత్పత్తి వ్యయానికి కనీసం 1.5 రెట్లు ఉండేలా నిర్ణయించాలన్న 2018-19 కేంద్ర బడ్జెట్ ప్రకటనకు అనుగుణంగా ఉంది. సగటు ఉత్పత్తి వ్యయంపై అంచనా వేసి గోధుమలకు 106 శాతం, ఆవాలకు 96 శాతం; కందిపప్పుకు 92 శాతం; బార్లీకి 58 శాతం; కుసుమ గింజలకు 50 శాతంగా నిర్ణయించారు.

# పేరు కొత్తైనా..విధానం, నాయకత్వం మారదు

ఉన్నందున వచ్చే ఎన్నికల్లో సీఎం అభ్యర్థి మీరేనా అని అడిగిన ప్రశ్నకు కేటీఆర్ స్పష్టంగా సమాధానం ఇచ్చారు. తాను ముఖ్యమంత్రి అభ్యర్థిని కాదని చెప్పారు. 2 ఏళ్ల తర్వాత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ స్వల్ప తేడాతో అధికారాన్ని కోల్పోయిందని చెబుతూ ప్రస్తుతం ప్రజలు గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, ముఖ్యంగా కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని ఆయన అన్నారు.కాంగ్రెస్ ఎన్నికల హామీలను ప్రస్తావిస్తూ 'రికాల్, రిగ్రెట్, రివోల్ట్' (ఆర్ఆర్ఆర్) అనే 3 పదాలను కేటీఆర్ ఉపయోగించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రజలు పునరాలోచన చేస్తున్నారని, పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నారని భవిష్యత్తులో తిరుగుబాటు వస్తుందని ఆయన తన రాజకీయ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మధ్య పొత్తు ఉంటుందన్న ఊహాగానాలపై కూడా కేటీఆర్ స్పందించారు. రెండు పార్టీల సిద్ధాంతాలు పరస్పరం పూర్తిగా భిన్నంగా ఉన్నాయని తాము బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. బీఆర్ఎస్ 26 ఏళ్ల చరిత్రలో బీజేపీతో పొత్తు పెట్టుకోలేదని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరును భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మార్చినప్పటికీ పార్టీ సిద్ధాంతంలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. పార్టీ డీఎన్ఏ మారలేదని అందువల్ల సిద్ధాంతం కూడా మారలేదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ భవిష్యత్తుపై విశ్వాసం వ్యక్తం చేసిన కేటీఆర్ తమ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చే సమయంలో గత పరాజయం కంటే పెద్ద స్థాయిలో పునరాగమనం ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు.పార్లమెంట్ నియోజకవర్గాల డీలిమిటేషన్ అంశంపైనా కేటీఆర్ తన అభిప్రాయాలను వెల్లడించారు. లోక్‌సభ స్థానాలను పెంచడంపై మాత్రమే ఎందుకు దృష్టి పెట్టాలని ప్రశ్నించిన ఆయన ప్రజలకు ఎమ్మెల్యేలే తొలి స్థాయి ప్రజాప్రతినిధులుగా ఉంటారని అన్నారు. జనాభా నియంత్రణ చర్యలను అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు భవిష్యత్తులో ప్రాతినిధ్యం విషయంలో అన్యాయం జరగకూడదన్న ఆందోళనను కేటీఆర్ వ్యక్తం చేశారు. పార్లమెంట్ స్థానాల సంఖ్యను ప్రస్తుత స్థాయిలో కొనసాగించడంతో పాటు, ప్రాతినిధ్యం విషయంలో అనుపాత విధానాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అవసరాన్ని పూర్తిగా వ్యతిరేకించడం లేదని కేటీఆర్ చెప్పారు. ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు సవరించడం అవసరమేనని పేర్కొన్నారు. అయితే ఈ ప్రక్రియ పారదర్శకంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనే అత్యధిక ఓటర్ల తొలగింపు జరిగిందని కేటీఆర్ ఆరోపించారు. దీనిపై తమ పార్టీ ఎన్నికల సంఘాన్ని సంప్రదించిందని అన్ని వర్గాలతో చర్చించి పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాలని కోరినట్లు చెప్పారు.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా 2 ఏళ్ల సమయం ఉందని పేర్కొన్న కేటీఆర్ అందువల్ల తమకు న్యాయపరమైన మార్గాలను ఆశ్రయించే అవకాశం కూడా ఉందని వెల్లడించారు. ఎన్నికల ముందు ఎస్ఐఆర్ జరిగితే ఎదురయ్యే సమస్యలతో పోలిస్తే ప్రస్తుతం తమకు చట్టపరంగా ప్రశ్నించే సమయం ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

# మోదీ-ట్రంప్ ఫోన్ కాల్

- వాణిజ్యం, రక్షణ, ఇంధనంపై కీలక చర్చలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్లో కీలకమైన అంశాలపై చర్చించారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని సమీక్షించినట్లు మోదీ తెలిపారు. ట్రంప్‌తో జరిగిన చర్చలు ఫలప్రదంగా సాగాయని మోదీ 'ఎక్స్'లో వెల్లడించారు. భారత్-అమెరికా సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సన్నిహితంగా కొనసాగాలని ఇరు దేశాల నేతలు అంగీకరించినట్లు తెలిపారు.ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా ఇద్దరూ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రపంచ శాంతి, భద్రతను ముందుకు తీసుకెళ్లేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై చర్చించారు. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నేతలు పునరుద్ఘాటించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. అలాగే భవిష్యత్తులోనూ పరస్పరం సంప్రదింపులు కొనసాగించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. భారత్-అమెరికా సంబంధాల్లో వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల వంటి రంగాలు ముఖ్యమైనవిగా కొనసాగుతున్నాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్య సహకారం కొనసాగుతున్నప్పటికీ, ప్రస్తుతం సమగ్ర ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లో లేదని విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియా-యూఎస్ ట్రేడ్ ఫెసిలిటేషన్ పోర్టల్ పేర్కొంటోంది. గతంలోనూ మోదీ, ట్రంప్ పలుమార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో జీ7 సదస్సు సందర్భంగా ఇద్దరూ భేటీ అయి భారత్-అమెరికా సంబంధాలపై చర్చించినట్లు విదేశాంగ శాఖకు సంబంధించిన వివరాలను ఉటంకిస్తూ తాజా నివేదికలు తెలిపాయి.

# తాడేపల్లి హుకుం.. క్షేత్రస్థాయిలో నైరాశ్యం!

స్థానిక సంస్థల సమరం వచ్చిపడింది. జగన్ ఆదేశాల ప్రకారం ఊరూరా అభ్యర్థులను నిలబెట్టాలన్నా, అసలు పార్టీ జెండా పట్టుకుని నామినేషన్ వేసేందుకు క్షేత్రస్థాయి నాయకులు, ద్వితీయ శ్రేణి కార్యకర్తలు ముందుకు రావడం లేదనే ప్రచారం సాగుతోంది. ఎన్నికల బరిలో నిలిస్తే కూటమి ప్రభుత్వం నుంచి ఎదురయ్యే రాజకీయ సమీకరణాలు, కేసుల భయంతో పాటు ఆర్థిక భారాన్ని మోయలేమని స్థానిక నేతలు వెనకడుగు వేస్తున్నారు.

## గూటికి గండి కొడుతున్న నిరంతర వలసలు

పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఐదేళ్లపాటు అన్ని రకాల ప్రాధాన్యతలు, పదవులు అనుభవించిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ ఛైర్మన్లు, జిల్లా స్థాయి నేతలు ఇప్పుడు ఒక్కొక్కరుగా వైఎస్సార్‌సీపీకి గుడ్‌బై చెబుతున్నారు. విజయనగరం జిల్లాలో బొత్స సత్యనారాయణ అనుచరులు, మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు తో పాటు పలు గ్రామాల నేతలు గుత్తాధిపత్యంగా రాజీనామాలు చేయడం ఇందుకు తాజా ఉదాహరణ. జిల్లాల్లో కీలక నాయకులే పక్కచూపులు చూస్తూ అధికార కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన వైపు వెళ్తుంటే గ్రామాల్లో ఉండే క్షేత్రస్థాయి కార్యకర్తలు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు.

## జగన్ వన్-మ్యాన్ షో వ్యూహం

కష్టకాలంలో పర్యటనలు చేస్తూ, కార్యకర్తలకు నేరుగా అండగా నిలవాల్సిన అధినేత జగన్ ఇప్పటికీ కేవలం తాడేపల్లి ఆఫీస్‌కే పరిమితమై రివ్యూ సమావేశాల ద్వారానే నడిపిస్తున్నారనే విమర్శలు స్వంత పార్టీలోనే వినిపిస్తున్నాయి. పార్టీని వీడుతున్న నేతలను బుజ్జగించడానికి లేదా క్షేత్రస్థాయిలో వేధింపులకు గురవుతున్నామంటున్న కార్యకర్తలకు ప్రత్యక్షంగా రోడ్డుపైకి వచ్చి నమ్మకం కలిగించేందుకు జగన్ పెద్దగా ప్రయత్నించడం లేదన్న అసంతృప్తి క్యాడర్‌లో ఉంది. అధినేత విధానాలు కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయని, క్షేత్రస్థాయి రక్షణ కల్పించలేకపోతున్నారని ద్వితీయ శ్రేణి నేతలు భావిస్తున్నారు.

## సింబాలిక్ పోరు గా మారుతున్న పోటీ

స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారంలో ఉన్న పార్టీలకే ఎప్పుడూ పైచేయి ఉంటుంది. అధికారిక యంత్రాంగం, నిధుల బలం, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ పదవుల ద్వారా వచ్చే ప్రాధాన్యతలు అధికార పార్టీ అభ్యర్థులకే అనుకూలంగా మారతాయి. ఇలాంటి సమయంలో ప్రతిపక్షంలో ఉన్న వైస్రపీ అన్ని స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టడం దేవుడెరుగు, కనీసం పోటీ ఇచ్చే బలమైన అభ్యర్థులను వెతకడమే సవాలుగా మారింది. ఫలితంగా చాలా చోట్ల అభ్యర్థులు దొరకక పార్టీ 'సింబాలిక్'గా మాత్రమే నామినేషన్లు వేయించే పరిస్థితి రావచ్చు. మరోవైపు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం స్థానిక ఎన్నికలను ఏకపక్షం చేయాలనే పక్కా వ్యూహంతో ముందుకు వెళ్తోంది. గతంలో వైస్రపీకి కంచుకోటలుగా ఉన్న రాయలసీమ, ఉమ్మడి విశాఖ, విజయనగరం, నెల్లూరు జిల్లాల్లో స్థానిక నాయకత్వాన్ని తమవైపు తిప్పుకోవడం ద్వారా వైస్రపీ ఓటు బ్యాంకును దెబ్బకొడుతోంది. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో పాటు స్థానిక ఎన్నికల్లో సత్తా చాటి ప్రతిపక్షాన్ని మానసికంగా మరింత దెబ్బతీయాలని కూటమి భావిస్తోంది.

## వైఎస్సార్‌సీపీ మనుగడకు అత్యంత కీలకమైన పరీక్ష

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం పదవుల కోసం జరుగుతున్న పోరు మాత్రమే కాదు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇది ఉనికికి సంబంధించిన 'లిట్మస్ టెస్ట్'. తాడేపల్లి నుంచి హుకుం జారీ చేయడం వల్ల మాత్రమే ఓట్లు రాలవు. జగన్ ఇప్పటికైనా తన శైలిని మార్చుకుని, తాడేపల్లి దాటి జిల్లాల పర్యటనలు చేపట్టి, స్థానిక కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం నింపకపోతే ఈ ఎన్నికల ఫలితాలు వైసీపీకి కోలుకోలేని దెబ్బగా మారే ప్రమాదం ఉంది.

# రాజస్థాన్‌తో ఒప్పందం రద్దు చేయండి

## - సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు లేఖ

- రాజస్థాన్‌కు 800 మెగావాట్ల విద్యుత్ కేటాయింపుపై తీవ్ర అభ్యంతరం
- తెలంగాణ వనరులతో ఇతర రాష్ట్రాలకు విద్యుత్ ఇవ్వడమేంటని ప్రశ్న
- రాష్ట్రంలో రైతులు కరెంట్ కోతలతో ఇబ్బంది పడుతున్నారని ఆరోపణ




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ విద్యుత్ రంగంలో సింగరేణి-రాజస్థాన్ ఒప్పందం మరోసారి రాజకీయ చర్చకు దారితీసింది. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ విస్తరణలో ఉత్పత్తయ్యే విద్యుత్‌లో రాజస్థాన్‌కు వాటా ఇవ్వడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. సింగరేణి తెలంగాణ ప్రజల ఆస్తి అని దాని పెట్టుబడులు, వనరులు ఇతర రాష్ట్రాల ప్రయోజనాలకు ఎందుకు వినియోగించాలంటూ ప్రశ్నించారు.హరీశ్‌రావు లేఖలో ప్రధానంగా జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ప్రస్తావించారు. ఈ ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు సింగరేణి గనుల నుంచే అందుబాటులో ఉందని నీటి అవసరాలను సమీపంలోని గోదావరి ద్వారా తీర్చుకునే అవకాశం ఉందని హరీశ్ రావు పేర్కొన్నారు. ప్లాంట్ ఉన్న స్థలం కూడా తెలంగాణలోనే ఉన్నందున ఇక్కడ ఉత్పత్తయ్యే విద్యుత్‌పై రాష్ట్ర ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే సింగరేణి, రాజస్థాన్ రాజ్య విద్యుత్ ఉత్పాదన్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీయూఎన్‌ఎల్) మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం తెలంగాణలో 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టును చేపట్టే ప్రతిపాదన ఉంది.
ఇందులో తెలంగాణ, రాజస్థాన్‌కు చెరో 800 మెగావాట్ల విద్యుత్ కేటాయింపు ఉంటుందని ఒప్పంద సమయంలో వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే బొగ్గు మనది, నీళ్లు మనవి, స్థలం మనది కానీ ఇక్కడ ఉత్పత్తయ్యే 800 మెగావాట్ల విద్యుత్‌లో వాటా రాజస్థాన్‌కు ఎందుకు అని హరీశ్‌రావు ప్రశ్నించారు. సింగరేణి-ఆర్‌వీయూఎన్‌ఎల్ భాగస్వామ్యంలో చేపట్టే విద్యుత్, సౌర ప్రాజెక్టులకు కలిపి సుమారు రూ.22 వేల కోట్ల పెట్టుబడి ఉంటుందని ఒప్పంద సమయంలో ప్రకటించారు. తెలంగాణలో 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుతో పాటు రాజస్థాన్‌లో 1,500 మెగావాట్ల సోలార్ పార్క్ ఏర్పాటు ప్రతిపాదన కూడా ఇందులో ఉంది. ఈ పెట్టుబడిలో సింగరేణి వనరులను రాజస్థాన్ అభివృద్ధికి మళ్లించాల్సిన అవసరం ఏముందని హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణలోనే విద్యుత్ అవసరాలు ఉన్న సమయంలో ఇతర రాష్ట్రానికి విద్యుత్ కేటాయించే నిర్ణయం ఎందుకు తీసుకున్నారో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రైతులకు 24 గంటల విద్యుత్ అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని హరీశ్‌రావు ఆరోపించారు. కనీసం 7, 8 గంటల విద్యుత్ కూడా అందని పరిస్థితులు ఉన్నాయని ఆయన విమర్శించారు.విద్యుత్ కొరత, పవర్ హాలిడేల వంటి అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వ నిర్వహణపై ప్రశ్నలు సంధించారు. విద్యుత్ వ్యవస్థలో తమ ప్రభుత్వ వైఫల్యాలను వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో వంటి కారణాలపై నెట్టివేయడం సరికాదని అన్నారు. అలాగే యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు నాణ్యమైన బొగ్గు అందించాల్సి ఉండగా తక్కువ గ్రేడ్ బొగ్గు వినియోగిస్తున్నారంటూ హరీశ్‌రావు ఆరోపించారు. కొత్తగూడెం, భద్రాద్రి విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అంతరాయాలకు కూడా ప్రభుత్వ నిర్వహణే కారణమని విమర్శించారు. ఇవన్నీ హరీశ్‌రావు చేసిన ఆరోపణలేనని వాటిపై ప్రభుత్వం స్పందించాల్సి ఉంది. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా ఎన్టీపీసీ నుంచి తెలంగాణకు లభించాల్సిన విద్యుత్ విషయంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు కోరారు. రాష్ట్రానికి అదనపు భారం లేకుండా అందుబాటులోకి వచ్చే 1600 మెగావాట్ల విద్యుత్‌ను ఎందుకు వినియోగించుకోవడం లేదని ప్రశ్నించారు. విద్యుత్ కేంద్రాల్లో తగినంత బొగ్గు నిల్వలు లేకపోవడంపై కూడా ఆయన విమర్శలు చేశారు. ఈ అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకున్నారని, ఇది ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు.సింగరేణి-రాజస్థాన్ విద్యుత్ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. రాష్ట్రంలోని రైతులు, ప్రజల విద్యుత్ అవసరాలను ముందుగా తీర్చిన తర్వాతే ఇతర రాష్ట్రాలకు విద్యుత్ కేటాయింపులపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఒప్పందాన్ని రద్దు చేయకపోతే రైతుల తరఫున బీఆర్ఎస్ పార్టీ ఉద్యమాన్ని చేపడుతుందని హరీశ్‌రావు హెచ్చరించారు. మరోవైపు ఈ ఒప్పందం ద్వారా తెలంగాణలో 1600 మెగావాట్ల థర్మల్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడంతో పాటు రాజస్థాన్‌లో 1500 మెగావాట్ల సౌర ప్రాజెక్టును చేపట్టేలా ఒప్పందం చేసుకున్నారు.

# భోజనం చేసిన వెంటనే యోగా చేస్తే..!



యోగికి ఎటువంటి వ్యాధి లేనట్లుగా, యోగా చేసేవారి ఆరోగ్యానికి ఏ ఢోకా ఉండదని చెబుతున్నారు నిపుణులు. యోగాతో పాటు, ఆహారానికి కూడా మంచి ప్రాముఖ్యత ఇవ్వాలి. ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం ఎలా ఉండాలి? ఆహారం తినడానికి, యోగా చేయడానికి మధ్య ఎంత సమయం ఉండాలి? ఆరోగ్యంగా ఉండాలంటే రోజువారీ కార్యకలాపాల్లో శారీరక వ్యాయామాన్ని భాగం చేసుకోవడం చాలా అవసరం. ముఖ్యంగా చిన్నపాటి యోగాసనాలు ఆరోగ్యానికి చెప్పలేనంత మేలు చేస్తాయి. యోగా శరీర వశ్యతను పెంచడంలో సహాయపడటమే కాకుండా, మొత్తం ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. యోగికి ఎటువంటి వ్యాధి లేనట్లుగా, యోగా చేసేవారి ఆరోగ్యానికి ఏ ఢోకా ఉండదని చెబుతున్నారు నిపుణులు. యోగాతో పాటు, ఆహారానికి కూడా మంచి ప్రాముఖ్యత ఇవ్వాలి. ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం ఎలా ఉండాలి? ఆహారం తినడానికి, యోగా చేయడానికి మధ్య ఎంత సమయం ఉండాలి? అనే విషయాల గురించి సీనియర్ డైటీషియన్, డయాబెటిస్ నిపుణుడు డాక్టర్ నిషా జైన్ మాట్లాడుతూ.. యోగా చేయడానికి ముందు మీ కడుపు సాధ్యమైనంత వరకు ఖాళీగా ఉండాలని అన్నారు. భోజనానికి, యోగాకు మధ్య కనీసం 8 నుంచి 10 గంటల గ్యాప్ నిర్వహించడం మంచిదని సూచించారు. సాయంత్రం త్వరగా భోజనం తినవచ్చు. ఆ తర్వాత ఆ మరుసటి రోజు ఉదయం పూట యోగా క్షేమంగా చేయవచ్చు. అయితే పగటిపూట యోగా చేస్తుంటే మాత్రం తినడానికి, యోగాకి మధ్య కనీసం 1 గంట గ్యాప్ అవసరమని చెప్పారు. అంటే భోజనం తిన్న 1 గంటలోపు యోగా చేయకుండా ఉండాలని అంటున్నారు. యోగా చేసే ముందు తేలికైన ఆహారాలు తినవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. యోగా చేసే ముందు గ్రీన్ టీ, బ్లాక్ కాఫీ, అరటిపండ్లు, ఆపిల్స్ తినవచ్చు. నట్స్, డ్రైఫ్రూట్స్ వంటి ఆహారాలు తినవచ్చు. ఈ ఆహారాలు శరీరంలో నెమ్మదిగా శక్తిని విడుదల చేస్తాయి. ఇది యోగా సమయంలో శరీరాన్ని చురుగ్గా ఉంచుతుంది కూడా. ముఖ్యంగా యోగా చేసే ముందు వేయించిన లేదా కారంగా ఉండే ఆహారాన్ని పూర్తిగా మానేయడం మంచిది. ఇది కడుపు ఉబ్బరం, కడుపులో భారమైన అనుభూతి, వికారం వంటి లక్షణాలను కలిగిస్తుంది. యోగా చేసిన 30 నిమిషాల తర్వాత పుష్కలంగా నీరు తాగాలి. ఇది శరీరాన్ని తిరిగి హైడ్రేట్ చేస్తుంది. దీనితో పాటు, కొబ్బరి నీరు లేదా నిమ్మకాయ నీరు కూడా తాగవచ్చు. అలాగే యోగా తర్వాత ప్రోటీన్ ఆహారాలు కూడా తీసుకోవచ్చు. ఇందుకోసం ఉడికించిన గుడ్లు తినవచ్చు.

## ఈ అలవాట్లు ఉంటే
# పాతిక ఏళ్లకే వృద్ధాప్యం..



కొంత మంది పాతికేళ్లకే నలభై ఏళ్ల మాదిరి కనిపిస్తుంటారు. ముఖ్యంగా అబ్బాయిల్లో ఈ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. నిజానికి.. మన రోజువారీ ఆహార అలవాట్లు ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని నిపుణులు అంటున్నారు. అంతేకాదు వృద్ధాప్యానికి కూడా ఈ అలవాట్లే కారణమవుతాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మన రోజువారీ ఆహార అలవాట్లు ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. అంతేకాదు వృద్ధాప్యానికి కారణమవుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఏమి తింటారు అనే దాని నుంచి స్ట్రెస్‌ని ఎలా ఎదుర్కొంటారు అనే దాని వరకు.. అన్ని అంశాలు మీ వయస్సు ఎంత వేగంగా క్షీణిస్తుందో నిర్ణయించగలవట. అలాగే ఈ అలవాట్లు దీర్ఘకాలిక ఆరోగ్యంపై కూడా పెద్ద ప్రభావాన్ని చూపుతుందని చెబుతున్నారు. ధూమపానం: వృద్ధాప్య ప్రక్రియను వేగవంతం చేసే విషయంలో ధూమపానం అత్యంత హానికరమైన అలవాట్లలో ఒకటి. ఇది చర్మం స్థితిస్థాపకతను దెబ్బతీస్తుంది. ఇది రక్త ప్రవాహాన్ని తగ్గిస్తుంది. ముడతలు, నిస్తేజమైన చర్మానికి దారితీస్తుంది. ఇది కాలేయంతో సహా మొత్తం శరీర ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. మద్యం సేవించడం: అధికంగా మద్యం సేవించడం వల్ల వృద్ధాప్య సంకేతాలు కనిపిస్తాయి. మద్యం చర్మాన్ని డీహైడ్రేట్ చేస్తుంది. వాపుకు కారణమవుతుంది. అధికంగా మద్యం సేవించడం వల్ల కాలక్రమేణా కాలేయ పనితీరు దెబ్బతింటుంది. అధిక వేడి: విటమిన్ డి కోసం సూర్యరశ్మి చాలా అవసరం. అయినప్పటికీ.. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య సూర్యరశ్మిని నివారించడం మంచిది. ఎందుకంటే ఇది చర్మం వృద్ధాప్యాన్ని వేగవంతం చేస్తుంది. సన్ స్క్రీన్ ఉపయోగించకపోతే, చర్మాన్ని సూర్య రశ్మి నుంచి కాపాడుకోవడానికి రక్షణ దుస్తులు ధరించకపోతే సూర్యరశ్మి వల్ల మచ్చలు, సన్నని గీతలు, ముడతలు చర్మంపై ఏర్పడి వృద్ధాప్య ప్రక్రియను వేగవంతం చేస్తాయి. దీర్ఘకాలిక నిర్జలీకరణం: సరైన హైడ్రేషన్.. అంటే తగినంత నీరు తాగకపోతే డీహైడ్రేషన్ సమస్యలు వస్తాయి. తగినంత నీరు త్రాగకపోవడం వల్ల చర్మం పొడిబారి, పొలుసులుగా మారి నిర్జీవంగా కనిపిస్తుంది. ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెర తీసుకోవడం: చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారాలు జీవక్రియను ప్రభావితం చేయడమే కాకుండా చర్మ సమస్యలు, వాపుకు కూడా కారణమవుతాయి.

ఇది చర్మం జీవం కోల్పోవడం, ముడతలు వంటి వృద్ధాప్య అకాల సంకేతాలకు దారితీస్తుంది. ఒత్తిడి: వృద్ధాప్యానికి ఒత్తిడి ప్రధాన కారణం. దీర్ఘకాలిక ఒత్తిడి హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తుంది. నిద్రను ప్రభావితం చేస్తుంది. ముఖంపై మచ్చలు లేదా కళ్ళ కింద నల్లటి వలయాలకు దారితీస్తుంది. ఒత్తిడిని నిర్వహించడానికి, మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి "భ్రమరి ప్రాణాయామం" చేయడం మంచి మార్గం.

## ఉదయాన్నే ఈ తెల్లటి
# రసం తాగి చూడండి..



ప్రతి రోజు ఉదయం ఒక గ్లాసు తెల్ల గుమ్మడికాయ రసం తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది. చాలా మంది ఉదయాన్నే కాఫీ, టీ తాగుతారు. వాటికి బదులు ఈ సహజ రసం తీసుకుంటే శరీరానికి మేలు చేస్తుంది. మనసుకు ప్రశాంతతను ఇస్తుంది. తెల్ల గుమ్మడికాయలో చాలా పోషకాలు ఉంటాయి. ఇవి నరాలకు శక్తిని ఇస్తాయి. మెదడును ప్రశాంతంగా ఉంచడంలో సహాయపడుతాయి. దాంతో ఉదయాన్నే ఈ రసం తాగితే ఒత్తిడి తగ్గుతుంది. ఆందోళన లేకుండా రోజంతా ఉత్సాహంగా ఉంటారు. ఈ రసం మూత్రపిండాలకు ఎంతో మేలు చేస్తుంది. మూత్రంలో వచ్చే ఇన్ ఫెక్షన్లు, మూత్రంలో రక్తం రావడం, పైల్స్ వల్ల రక్తం పోవడం లాంటి సమస్యలను తగ్గిస్తుంది. తెల్ల గుమ్మడికాయ రసం చల్లగా ఉంటుంది. శరీరాన్ని ప్రశాంతంగా ఉంచుతుంది. అల్సర్ తో బాధపడేవారు తెల్ల గుమ్మడికాయ రసాన్ని తేనెతో కలిపి ఉదయం తాగితే కడుపు లోపల గాయాలు త్వరగా తగ్గుతాయి. కడుపులోని పురుగులను బయటకు పంపిస్తుంది. కొత్త ఇన్ ఫెక్షన్లు రాకుండా ఆపుతుంది. బరువు తగ్గాలని అనుకునే వారికి ఇది బాగా ఉపయోగపడుతుంది. రోజూ ఉదయం ఈ రసం తాగడం వల్ల శరీరంలోని అదనపు నీరు బయటకు పోతుంది. ఇది బరువు తగ్గించడమే కాకుండా.. శరీరాన్ని తేలికగా, శక్తివంతంగా ఉంచుతుంది. శరీరంలో వేడి ఎక్కువగా ఉన్నవారికి కూడా ఇది చాలా మంచిది.

ఈ రసం తాగితే శరీరం చల్లబడుతుంది. తేమగా మారుతుంది. వేసవిలో వేడి సమస్యలతో బాధపడే వారికి ఇది మంచి పరిష్కారం. తెల్ల గుమ్మడికాయ రసాన్ని తేనెతో కలిపి ఉదయం, సాయంత్రం తాగితే రక్తం శుభ్రపడుతుంది. ఇది శరీరం లోపల అవయవాలకు సాయపడుతుంది. రక్తం కారడాన్ని నియంత్రించడంలో కూడా తోడ్పడుతుంది. ఈ గుమ్మడికాయలో విటమిన్ బి, సి, కాల్షియం, పొటాషియం, ఫాస్ఫరస్, ఫైబర్, ఐరన్, నీరు ఎక్కువగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి అవసరమైన ముఖ్యమైన పదార్థాలు. ప్రతి ఉదయం ఒక గ్లాసు తెల్ల గుమ్మడికాయ జ్యూస్ తాగడం మన శరీరానికి, మనసుకు చాలా మంచిది. ఇది ఒక చిన్న అలవాటు. కానీ దీని వల్ల చాలా గొప్ప ఫలితాలు ఉంటాయి.

# జ్వరానికి అసలు కారణం ఏంటి..?



మన శరీరానికి చాలా రకాల ఇన్ ఫెక్షన్లు వస్తాయి. వాటిలో ముఖ్యంగా వైరస్ లు, బ్యాక్టీరియా వల్ల వచ్చేవి ఎక్కువగా ఉంటాయి. ఒక వ్యక్తిని పరీక్ష చేసిన తర్వాత డాక్టర్ ఇది వైరల్ ఫీవర్ అని చెప్పడం మనం తరచూ వింటాం. కానీ అది వైరస్ వల్ల వచ్చిందని ఎలా అర్థం చేసుకోవాలి..? బ్యాక్టీరియా వల్ల వచ్చిందా లేదా వైరస్ వల్ల వచ్చిందా అని ఎలా తెలుసుకోవాలి..? ఈ రెండింటి మధ్య తేడాలు తెలుసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. వైరస్ లు, బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్లు ఈ రెండు జబ్బులు సూక్ష్మజీవుల వల్ల వస్తాయి. కానీ అవి శరీరంపై పని చేసే విధానం వేరుగా ఉంటుంది. బ్యాక్టీరియా అనేది సొంతంగా బతకగల ఒకే కణం జీవి. కొన్ని రకాల బ్యాక్టీరియా శరీరానికి హానికరం కావు. కానీ కొన్ని రకాల బ్యాక్టీరియా జబ్బులు కలిగిస్తాయి. ఉదాహరణకు టీబీ (ట్యూబర్క్యులోసిస్), యూరినరీ ట్రాక్ట్ ఇన్ ఫెక్షన్లు, గొంతు నొప్పి లాంటివి ఈ రకానికి చెందుతాయి. ఇవి యాంటీబయోటిక్ మందులతో నయం అవుతాయి. వైరస్ లు చాలా చిన్న జీవులు. ఇవి శరీరంలోకి వెళ్ళిన తర్వాత మంచి కణాలను ఆక్రమించి పెరుగుతాయి. వాటి వల్ల జలుబు, దగ్గు, జ్వరం, కోవిడ్ లాంటి జబ్బులు వస్తాయి. వైరల్ ఇన్ ఫెక్షన్ కు యాంటీబయోటిక్స్ పని చేయవు. వైరల్, బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్లకు కొన్ని లక్షణాలు ఒకేలా కనిపించవచ్చు. ఉదాహరణకు జ్వరం, గొంతు నొప్పి, అలసట, ఒళ్ళు నొప్పులు రెండింటిలోనూ రావచ్చు. కానీ వైరల్ ఇన్ ఫెక్షన్లు సాధారణంగా నెమ్మదిగా వస్తూ 5 నుంచి 10 రోజుల్లో తగ్గిపోతాయి. అయితే బ్యాక్టీరియల్ ఇన్ ఫెక్షన్లు రోజురోజుకూ తీవ్రంగా మారతాయి. వాటిని వదిలేస్తే ఇతర శరీర భాగాలకు వ్యాపించే ప్రమాదం ఉంటుంది. చాలా సార్లు డాక్టర్లు లక్షణాలను చూసి చెబుతారు. అయితే కచ్చితంగా తెలుసుకోవాలంటే రక్త పరీక్ష, మూత్ర పరీక్ష లాంటివి అవసరం. కొన్నిసార్లు గొంతు స్రావాన్ని కూడా చూడాలి. కొన్ని వైరల్ జబ్బులు పొక్కులు లాగా కనిపిస్తాయి.. ఉదాహరణకు ఆటలమ్మ, అమ్మవారు లాంటివి. కానీ కొన్నింటిని గుర్తించడానికి టెస్టులు అవసరం.. ఉదాహరణకు కోవిడ్, హెపటైటిస్. చికిత్స పూర్తిగా జబ్బుకు కారణాన్ని బట్టి నిర్ణయించాలి. వైరస్ వల్ల వచ్చిన ఇన్ ఫెక్షన్ లకు ఎక్కువగా విశ్రాంతి, ద్రవ పదార్థాలు తీసుకోవడం, కొన్ని ఉపశమనం ఇచ్చే మందులు వాడటమే చేస్తారు. బ్యాక్టీరియల్ ఇన్ ఫెక్షన్లు అయితే డాక్టర్ సూచన మేరకు యాంటీబయోటిక్స్ తీసుకోవాలి. కానీ వాటిని అనవసరంగా వాడకూడదు. అది రోగనిరోధక శక్తిని తగ్గిస్తుంది. అలాగే జాగ్రత్తలు తీసుకోవడం వల్ల జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. ఈ రెండు రకాల జబ్బులను కొన్ని సాధారణ జాగ్రత్తలతో ఆపవచ్చు. జబ్బుతో ఉన్నవారికి దూరంగా ఉండడం. గోరువెచ్చని నీళ్లు తాగడం. చేతులు కడగకుండా ముఖాన్ని తాకకూడదు. మాస్క్ వాడటం, శుభ్రత పాటించడం ముఖ్యమైనవి. వైరల్, బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్ల లక్షణాలు కొంతవరకు ఒకేలా కనిపించినా.. చికిత్స పూర్తిగా వేరుగా ఉంటుంది. సరైన పరీక్షల ద్వారానే సరైన వైద్యం అందుతుంది. అందుకే మనం జాగ్రత్తగా ఉండి.. ఏ లక్షణాలు కనిపించినా డాక్టర్లను కలిసి కారణాన్ని కచ్చితంగా తెలుసుకొని చికిత్స తీసుకోవాలి.

# ఈసీపై 'ఇండియా' కూటమి సమరశంఖం

**- దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపు**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని ఇండి కూటమి డిమాండ్ చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అభిశంసనకు సంబంధించి పార్లమెంటులో ప్రవేశపెట్టాల్సిన తీర్మానం ముసాయిదా నోటీసుకు ఆమోదం తెలిపేందుకు ఇండి కూటమి ఢిల్లీలో బుధవారం సమావేశమైంది. ఈ సమావేశంలో ఇండి కూటమి పలు తీర్మాణాలు చేసింది. అక్టోబర్ 2 నుంచి 8 వరకు సేవ్ డెమోక్రసీ మార్చ్ నిర్వహించాలని కూటమి నిర్ణయించింది. అలాగే ప్రతీ జిల్లా కేంద్రంలో మార్చ్ ఉంటుందని అన్ని కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించిది. అయితే ఈ ఇండి కూటమి సమావేశానికి డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీలు దూరంగా ఉన్నాయి. మరోవైపు సమాజ్ వాద్ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా హాజరుకాలేదు. అయితే యూపీలో రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల కారణంగా అఖిలేష్ యాదవ్ హాజరుకాలేదని తెలుస్తోంది.

**నవంబర్ 1న ఢిల్లీలో భారీ బహిరంగ సభ** సీఈసీపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీఈసీ తీరును నిరసిస్తూ పలు ఆందోళనలకు పిలుపునిచ్చారు. ఇండి కూటమి సమావేశం అనంతరం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే మీడియాతో మాట్లాడారు. అక్టోబర్ 6న సీఈసీ కార్యాలయాన్ని ఇండి కూటమి ముట్టడిస్తాం అని పిలుపునిచ్చింది. ఎంపీలంతా కలిసి సీఈసీ ఆఫీస్‌ను ముట్టడిస్తాం అని తెలిపారు. అక్టోర్ 2వ వారంలో రాష్ట్రపతిని కలిసి ఫిర్యాదు చేస్తాం అని చెప్పుకొచ్చారు. ప్రధాని నరేంద్రమోడీ, హోంశాఖ మంత్రి అమిత్ షా ఈసీని తలుబొమ్మలా వాడుతున్నారు అని మండిపడ్డారు. అందుకే ఎన్నికల్లో వరుసగా విజయాలు సాధిస్తున్నారని చెప్పుకొచ్చారు. దేశవ్యాప్తంగా ఐదు భారీ సభలు నిర్వహిస్తాం అని పేర్కొన్నారు. నవంబర్ 1న ఢిల్లీలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తాం అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే పేర్కొన్నారు.

**13.3 కోట్ల మంది ఓట్లు తొలగింపు దుర్మార్గం** ఇకపై దేశంలో ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్ల ద్వారా ఓటింగ్ జరపాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే డిమాండ్ చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియతో 13.3 కోట్ల మంది ఓటర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం చాలా ఆందోళనకరమని ఖర్గే అన్నారు. ప్రజాస్వామ్యంలో పాలుపంచుకునే వారి శక్తిని లాక్కోవడం దారుణమన్నారు. పౌరుల ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు ప్రమాదంలో ఉన్నప్పుడు భారత పార్టీలన్నీ ఏకతాటిపై నిలబడాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యానికి పునాది అయిన 'ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒక విలువ' అనే సూత్రం బలహీనపడకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉంది అని చెప్పుకొచ్చారు. అలాగే భవిష్యత్ ఎన్నికల కోసం ఎస్ఐఆర్‌కు ముందున్న ఓటర్ల జాబితాను ఉపయోగించాలని మల్లిఖార్జున ఖర్గే పేర్కొన్నారు.

**సీఈసీ తన పదవికి రాజీనామా చేసి అప్రూవర్‌గా మారాలి** 'ఎస్ఐఆర్ జాబితాకు సంబంధించి కమిషన్‌లోని ఇద్దరు సభ్యులు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల్లో కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఇది భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నిజాయతీపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. కాబట్టి ఆయన్ను పదవి నుంచి తొలగించాలి. లేదా ఆయనే స్వయంగా తన పదవికి రాజీనామా చేసి, ఓటర్ల జాబితాలో జోక్యం చేసుకుంటున్న శక్తులకు వ్యతిరేకంగా అప్రూవర్‌గా మారాలి'అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే డిమాండ్ చేశారు. దీంతో పాటు ఎస్ఐఆర్ ప్రక్రియలో, ఓటరు చేర్పులు, తొలగింపులు, సవరణలకు సంబంధించి పూర్తి పారదర్శకత ఉండాలి అని మండిపడ్డారు. 'అర్హతగల ఓటరును జాబితా నుంచి తొలగించే ముందు, సరైన నోటీసు, అందుకు గల కారణాలు తెలపాలి. అలాగే అప్పీల్ చేసుకునేందుకు సమర్థవంతమైన యంత్రాంగం ఉండాలి. పరిపాలనా లోపాలు, ఇతర కారణాల వల్ల అర్హులైన ఓటర్లు ఓటు హక్కును కోల్పోకుండా రక్షణ కల్పించాలి'అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే డిమాండ్ చేశారు. ఈ ఇండికూటమి సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్‌తోపాటు టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, ఎస్పీ, సీపీఐ, సీపీఐ(ఎం), ఎన్సీపీ-ఎస్పీ, ఆర్జేడీ, శివసేన-యూబీటీ, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ నేతలు హాజరయ్యారు. అయితే డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు డుమా కొట్టారు. యూపీలో రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల కారణంగా ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ హాజరుకాలేదని తెలుస్తోంది.

# సీఈవో జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి




శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) తిరుపతి కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ నేతల నిరసన కలెక్టర్‌కు వినతిపత్రం భారత ఎన్నికల ప్రధాన అధికారి సీ ఈ వో జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని తిరుపతి జిల్లా కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. జిల్లా డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబు ఆధ్వర్యంలో బుధవారం తిరుపతి కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టి, కలెక్టర్ వెంకటేశ్వరులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం తిరుపతి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలగురవం బాబు మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోసం ప్రజాక్షేత్రంలో పోరాడే పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. ప్రజలకు అన్యాయం జరుగుతున్నప్పుడు కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదని తెలిపారు. సీఈవో జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేత తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమంపై సహచర ఎన్నికల అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ ఏకపక్ష నిర్ణయాలతో దాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. లక్షలాది ఓట్లను తొలగించడమే లక్ష్యంగా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని విమర్శించారు. వెంటనే ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని నిలిపివేసి, జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిరణ్, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త నరసయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, కృష్ణమూర్తి, కార్యదర్శులు ఇళయరాజా, గోపి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనుగౌడ్, జిల్లా పరిపాలన కమిటీ చైర్మన్ రత్నం, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వినోద్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జ్యోతీశ్వర్ నాయక్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్సూర్, శ్రీకాళహస్తి మండల యువజన అధ్యక్షుడు నవీన్, నాగలాపురం మండల అధ్యక్షుడు షణ్ముగం, సూళ్లూరుపేట నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు శ్వేత, అనిల్ కుమార్, నాగరాజు, మహేష్, అరుణ్, చరణ్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భంగా మానవహారం

ప్రపంచ రేబీస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విన్స్ బయోప్రొడక్ట్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 వీధి కుక్కలకు సరిపడా యాంటీ రేబీస్ వ్యాక్సిన్‌లను డీసీపీ సి. సిరిషకు అందజేశారు. అనంతరం రేబీస్ నివారణపై అవగాహన కల్పిస్తూ వైద్యులు, ప్రజారోగ్య ప్రతినిధులతో కలిసి మానవహారం నిర్వహించారు. రేబీస్ నిర్మూలనకు టీకాలు, అవగాహన, సకాలంలో వైద్య చికిత్సతో పాటు సమష్టి కృషి అవసరమని డీసీపీ సి. సిరిష పేర్కొన్నారు.

## హృదయ ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం

ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (అూఎ) తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డా. ప్రియాంక అలా, హాజరయ్యారు. ఈ సందర్భంగా ుణఅూఎ అధ్యక్షుడు డా. వి. ముఖేష్ రావు మాట్లాడుతూ.. "ఆనీని'బి ఓతిబబ జీ ఃవజీబి" థీమ్‌తో గుండె జబ్బుల లక్షణాలు, ప్రమాద కారకాలను ముందుగానే గుర్తించడంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, వ్యాయామం, సమతుల ఆహారం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని వైద్య నిపుణులు సూచించారు.

## ముఖ్యమంత్రి సభ విజయవంతానికి పకడ్బందీ ఏర్పాట్లు



సిరిసిల్ల సిరిసిల్ల జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరానున్న నేపథ్యంలో పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, వైద్య సదుపాయాలు, విద్యుత్, పారిశుద్ధ్య ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించాను. సభా ప్రాంగణంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి గారి పాదయాత్ర నేపథ్యంలో మార్గమంతా భద్రతా ఏర్పాట్లు, బారికేడింగ్, ట్రాఫిక్ మళ్లింపులను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున సభా ప్రాంగణంలో క్రమశిక్షణ, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నాను. సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్లు ఆది శ్రీనివాస్, వేముల వీరేశం, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్తో పాటు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఉన్నత పాఠశాల భద్రాచలంలో ఘనంగా వన మహోత్సవం

**గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో సుమారు 300 మొక్కల నాటకం, పాఠశాలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని సర్పంచ్, గ్రీన్ భద్రాద్రి ప్రతినిధుల హామీ**



పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా, పచ్చదనాన్ని పెంపొందించాలనే సంకల్పంతో భద్రాచలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో ఘనంగా వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 300 మొక్కలను నాటారు. గ్రీన్ భద్రాద్రి నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేశారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమం వన మహోత్సవాన్ని తలపించేలా సందడిగా సాగింది. విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందించడంతో పాటు, మొక్కల పెంపకం, వాటి సంరక్షణ ప్రాముఖ్యతను తెలియజేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భద్రాచలం గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, మూడో వార్డు సభ్యుడు బొంతు రమణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. జాన్సన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా, పాఠశాల ఎకో క్లబ్ సభ్యులు బి. జయబాబు, పి.ఎస్.వి. ప్రసాద్ బాబుతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గ్రీన్ భద్రాద్రి తరఫున సంస్థ మాజీ అధ్యక్షులు గొల్ల భూపతిరావు, ఏ. ఉమామహేశ్వర నాయుడు, ఆర్టీసీ రామరాజు, సత్యసాయి సేవా సమితికి చెందిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. పాఠశాల ఆవరణను పచ్చదనంతో నింపేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. పాఠశాలకు అండగా ఉంటాం:

సర్పంచ్, గ్రీన్ భద్రాద్రి ప్రతినిధులు ఈ సందర్భంగా సర్పంచ్ పూనెం కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా, గ్రీన్ భద్రాద్రి ప్రతినిధులు కూడా పాఠశాల అభివృద్ధికి, అవసరమైన సదుపాయాల కల్పనకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యార్థుల అభ్యున్నతికి కూడా తమ సంస్థ ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందని పేర్కొన్నారు. సుమారు 300 మొక్కలను నాటడం ద్వారా పాఠశాల ఆవరణలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. మొక్కలను నాటడమే కాకుండా, వాటిని సంరక్షించి భవిష్యత్తు తరాలకు పచ్చని ప్రకృతిని అందించాలనే సందేశంతో వన మహోత్సవ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# వనపర్తి జిల్లా ఆసుపత్రిలో బాలింత మృతి

**బంధువుల ఆందోళన**

వనపర్తి ప్రజా వైద్యశాలలో మంగళవారం నాడు కొత్తకోట మండలం అపరాలకు చెందిన భవ్య(24) అనే మహిళ నార్మల్ డెలివరీ ద్వారా బిడ్డకు జన్మనిచ్చింది. అయితే బ్లీడింగ్ అవుతుండగానే వైద్యులు జనరల్ వార్డుకు షిఫ్ట్ చేసినట్లు బంధువులు అంటున్నారు. జనరల్ వార్డులో వైద్యుల పర్యవేక్షణ లేక నిన్న సాయంత్రం భవ్య మృతి చెందిందని అరోపించారు. హాస్పిటల్ ఎదుట భవ్య కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు.

# ఎమ్మెల్సీ టికెట్లపై తీన్మార్ మల్లన్న ఫైర్..

**జానారెడ్డి కుట్ర అంటూ సంచలన ఆరోపణ**

**రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్‌రెండు స్థానాలు రెడ్లకే ఇచ్చారని తీన్మార్ మల్లన్న విమర్శ**

**రాష్ట్రంలో బీసీ వాదం లేదని నిరూపించే ప్రయత్నం జరుగుతోందని మండిపాటు**



తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించడం రాజకీయంగా వేడి పుట్టించింది. రెండు సీట్లనూ రెడ్డి సామాజిక వర్గానికే కేటాయించడంపై తెలంగాణ రాజ్య అధికార పార్టీ నేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీవ్ర ఆరోపణలు చేశారు. దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, సీనియర్ నేత జానారెడ్డి నాటకమాడారని సంచలన వ్యాఖ్యలు చేశారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని, నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థులుగా ప్రకటించింది. దీనిపై మల్లన్న మాట్లాడుతూ... ఈ నిర్ణయం తనకు ఆశ్చర్యం కలిగించలేదన్నారు. "రెడ్ల పార్టీ రెడ్లకు కాకుండా బీసీలకు టికెట్లు ఇస్తేనే ఆశ్చర్యపడాలి" అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లోని రెడ్లు ఓ నాటకమాడారని, ఈ కేటాయింపుల వెనుక జానారెడ్డితో పాటు మరో టీచర్ ఎమ్మెల్సీ, ఇంకో రెడ్డి నేత కుట్ర ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఇద్దరు అభ్యర్థులు కేవలం 'బలిపశువులు' మాత్రమేనని మల్లన్న అభివర్ణించారు. పార్టీ గెలవడం కాదు, రెడ్లు గెలవాలన్నదే వారి లక్ష్యమని, దీని కోసం బీఆర్ఎస్‌లోని ఒక వ్యక్తితో రహస్య ఒప్పందం కూడా కుదిరిందని ఆరోపించారు. ఈ స్థానాల్లో కాంగ్రెస్‌కు గతంలో కనీసం డిపాజిట్లు కూడా దక్కలేదని, తాను గెలిచిన తర్వాతే అక్కడ ఆ పార్టీకి గుర్తింపు వచ్చిందని గుర్తుచేశారు. ఈ ఎన్నికలు రెడ్లు, వెలమలకు, బీసీలకు మధ్య జరుగుతున్న పోరాటంగా ఆయన అభివర్ణించారు. రాష్ట్రంలో బీసీ వాదం లేదని నిరూపించే ప్రయత్నం జరుగుతోందన్నారు. తమ తెలంగాణ రాజ్య అధికార పార్టీ తరఫున రెండు స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులను నిలబెట్టి గెలిపిస్తామని తీన్మార్ మల్లన్న ధీమా వ్యక్తం చేశారు. తన అభ్యర్థిత్వంపై త్వరలోనే స్పష్టత వస్తుందని తెలిపారు.

# రూ.40 లక్షలు విలువైన సింహ, గజ వాహనాలు విరాళం



శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి హైదరాబాద్ కు చెందిన దాతలు పి వి లక్ష్మీ రెడ్డి సింహ వాహనం, పి. వి.దివ్య ప్రియాంక గజ వాహనాన్ని విరాళంగా అందజేశారు. దాదాపు రూ. 40 లక్షలు విలువ చేసే బంగారు పూత పూసిన రెండు వాహనాలను ఆలయ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈవో వరలక్ష్మికి అందించారు.

# సింగరేణిలో40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారు

**- బాల్క సుమన్**



హైదరాబాద్ : సింగరేణి సంస్థను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణ అడ్డుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. సింగరేణిని అవినీతి మయం చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి బామ్మర్ది సృజన్ రెడ్డి కింగ్ పిన్‌గా అవినీతి జరుగుతోందన్నారు. జైపూర్ పవర్ ప్లాంట్ లో 334 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే జరుగుతోంది. సింగరేణిలో40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారని మండిపడ్డారు. ఒక్కో కార్మికుడికి లాభాల్లో లక్షా 80 వేల కోట్లు తక్కువగా ఇస్తున్నారు. సింగరేణి డబ్బులను సీఎం రేవంత్ రెడ్డి ఫుట్ బాల్ సోకులకు ఖర్చు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి అవినీతిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కేటీఆర్ లెటర్ రాశారు. కార్మికులకు నికర లాభాల్లో 36 శాతం వాటా ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సింగరేణి సంస్థలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 51 శాతాన్ని ప్రైవేట్ వాళ్లకు అమ్ముకోవాలని చూస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్ మేరకు డిప్యూటీ సీఎం భట్టి, అధికారులు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నారు. సింగరేణి అంటే సిరుల గని. సిరిసిల్లకు ఎన్ని నిధులిస్తారో చెప్పాలిసింగరేణి సంస్థను ఎవరికైనా అమ్మితే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అక్టోబర్ 5 వ తేదీన తెలంగాణ భవన్ లో సింగరేణి కోల్ బెల్ట్ ఏరియాలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గ ఇంఛార్జిలు, కార్మిక సంఘం నేతలతో కేటీఆర్ మీటింగ్ ఉంటుందన్నారు. సిరిసిల్లను కేటీఆర్ ఎంతో అభివృద్ధి చేశారు. రేవంత్ రెడ్డికి మైక్ దొరికితే తిట్టడం తప్ప వేరే పని లేదన్నారు. సిరిసిల్లకు రేవంత్ రెడ్డి ఎన్ని నిధులు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి సిరిసిల్లకు టూరిస్ట్ లాంటి వారు. నాయకులను ఓడగొట్టడం, గెలిపించడం ప్రజల చేతుల్లో ఉంటుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నేతన్నల ఆత్మహత్యలు జరుగుతున్నాయి. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు చుట్టూ రేవంత్ రెడ్డి రాజకీయం తిప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు 45 టీఎంసీలు ఇవ్వొద్దని సీడబ్ల్యూసీకి చంద్రబాబు లేఖలు రాస్తున్నారు. నాన్ బేసిన్ కుప్పంకు కృష్ణా నది నీళ్లను తరలించారు. గురువు కండ్లలో ఆనందం కోసం రేవంత్ రెడ్డి తెలంగాణను ఎండబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకో 20 ఏళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ మొలకెత్తదన్నారు.

## ఉడుతలపల్లి శివారు పొదల్లో మృతదేహం లభ్యం

చండూరు: చండూరు మండలం ఉడుతలపల్లి గ్రామ శివారులో రోడ్డు పక్కన గడ్డి పొదల్లో ఓ వ్యక్తి మృతదేహం బుధవారం కనిపించడం మండలంలో కలకలం రేగింది. బుధవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే చండూరు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడిని కనగల్ మండలం పోనుగోడు గ్రామానికి చెందిన బండమీది శ్రీనుగా గుర్తించారు. శ్రీను కూరంపల్లి గ్రామంలో బైక్ మెకానిక్ షాప్ నిర్వహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మంగళవారం రాత్రి ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతదేహం లభించిన ప్రదేశం, పరిసరాలను పరిశీలించారు. ప్రమాదం వల్ల చనిపోయాడా లేక ఇంకా ఇతర కారణాలతో మరణించి ఉండవచ్చా అని స్థానికులు అనుమానాలు వ్యక్త పరుస్తుండడంతో మరణానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# చందానగర్‌లో గంజాయి స్వాధీనం.. ఇద్దరిని అరెస్ట్ చేశారు.



కొండాపూర్, సెప్టెంబర్ 30 : గంజాయి అక్రమ రవాణా, విక్రయానికి పాల్పడుతున్న ఇద్దరిని చందానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 1.5 కిలోల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారంతో చందానగర్ రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయగా, గమనించిన నిందితులు పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిలో విశాఖపట్నానికి చెందిన మెరిపాటి మనోజ్‌కుమార్ (22), విజయనగరం జిల్లాకు చెందిన ఎం ఆశాజ్యోతి (23)లుగా గుర్తించారు. విచారణలో ఒడిశాలోని కుందులి ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలించి విక్రయిస్తున్నట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి నమూనాలను ఎఫ్ఎస్ఎల్ పరీక్షలకు పంపించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఏర్పాట్లపై కూన శ్రీశైలం గౌడ్ సమీక్ష




కుత్బుల్లాపూర్, సిరిసిల్ల నియోజకవర్గంలోని సిరిసిల్ల పట్టణంలో రేపు జరగనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్ మంగళవారం తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి జన సమీకరణ,సభా ఏర్పాట్లు, ఇతర కార్యక్రమాల నిర్వహణపై నాయకులతో చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మునిగే రాజు, సర్ కోఆర్డినేటర్ ప్రవీణ్ టోనీ, ముఖ్య నాయకులు, ఇతర నేతలు పాల్గొన్నారు.

# శ్రీశైల.. దేవస్థానంలో చెంచుగిరిజనులకు ఉచిత స్పర్శదర్శనం



శ్రీశైలం. ప్రతీ నెలలోనూ ఒకరోజున అనగా ప్రతీ నెలలో చివరి బుధవారం రోజున చెంచుగిరిజనులకు ప్రత్యేకంగా ఉచిత స్పర్శదర్శనం కల్పించాలని నిర్ణయించడం జరిగింది. ఇందులో భాగంగా 259 మంది చెంచు గిరిజన భక్తులకు శ్రీస్వామివార్ల ఉచిత స్పర్శదర్శనం మరియు అమ్మవారి దర్శనం కల్పించబడింది. స్థానిక చెంచుగూడెములతో పాటు నంద్యాల జిల్లా నుంచి 45 మంది, మార్కాపురం జిల్లాలోని 104 మంది చెంచు భక్తులు, మాచర్ల నుండి 110 మంది చెంచు గిరిజనులు స్పర్శదర్శనాన్ని చేసుకోవడం జరిగింది. దర్శనానంతరం చెంచు గిరిజన భక్తులందరికీ దేవస్థాన అన్నపూర్ణా ప్రసాదవితరణ భవనంలో అన్నప్రసాదాలు ఏర్పాటు చేయబడ్డాయి. కాగా చెంచుగిరిజన భక్తులు సంప్రదాయబద్ధంగా తప్పెట వాయిద్యాలతో, చెంచు నృత్యాలతో దర్శనానికి విచ్చేశారు. వారికి ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సిబ్బంది ఆహ్వానం పలికారు. శ్రీస్వామివారి ఉచిత స్పర్శదర్శనానికి చెంచుగిరిజన భక్తులను ఎంపిక చేయడంలో స్థానిక ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి వారి సహకారాన్ని తీసుకోవడం జరిగింది.

# 35 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు

**రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి: ఏఓ జి. మల్లేష్ కుమార్**



సి. బెళగల్, రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని సి. బెళగల్ మండల రైతులకు సబ్సిడీపై శనగ విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మండల వ్యవసాయ అధికారి జి. మల్లేష్ కుమార్ తెలిపారు. మండలానికి మొత్తం 130 క్వింటాళ్ల శనగ (బెంగాల్ గ్రాము) సబ్సిడీ విత్తనాలను కేటాయించినట్లు వెల్లడించారు. కేటాయించిన విత్తనాల్లో పోలకల్ గ్రామానికి 100 క్వింటాళ్లు, సి. బెళగల్ గ్రామానికి 15 క్వింటాళ్లు, బ్రాహ్మణదొడ్డికి 15 క్వింటాళ్లు కేటాయించినట్లు తెలిపారు. ఒక క్వింటాలు శనగ విత్తనాల పూర్తి ధర రూ.9,000 కాగా, ప్రభుత్వం 35 శాతం సబ్సిడీగా రూ.3,150 అందిస్తోంది. సబ్సిడీ పోను రైతులు ఒక క్వింటాలుకు రూ.5,850, అంటే కిలోకు రూ.58.50 చెల్లించాల్సి ఉంటుందని వ్యవసాయ అధికారి వివరించారు. అదేవిధంగా 20 కిలోల ఒక బస్తా ధర సబ్సిడీ అనంతరం రూ.1,170గా ఉంటుందని తెలిపారు. ఒక రైతుకు గరిష్ఠంగా రెండు ఎకరాల వరకు నాలుగు బస్తాలు, ఒక్కో బస్తా 20 కిలోల చొప్పున శనగ విత్తనాలను అందజేయనున్నట్లు చెప్పారు. రబీ సీజన్‌లో శనగ సాగు చేయదలచిన రైతులు తమకు సంబంధించిన రైతు సేవా కేంద్రాల్లో విత్తనాల కోసం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంఏఓ జి. మల్లేష్ కుమార్ సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సబ్సిడీపై శనగ విత్తనాలను పొందాలని ఆయన కోరారు.

# జలసిరి కుంటల్లో గంగపుత్రులకు చేపల పెంపకం అవకాశం కల్పించాలి

**- 50 వేల నీటి కుంటలతో మత్స్యకారులకు జీవనోపాధి భరోసా కల్పించాలి**

**- మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేసిన తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) జలసిరి పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా నిర్మించనున్న సుమారు 50 వేల నీటి కుంటల్లో చేపల పెంపకానికి గంగపుత్రులకు అవకాశం కల్పించాలని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు తెలంగాణ సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. తరతరాలుగా చేపల పెంపకం, మత్స్యకార వృత్తినే జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్న గంగపుత్రులకు జలసిరి పథకం ద్వారా నిర్మించే నీటి కుంటలు మంచి ఉపాధి అవకాశాలుగా మారుతాయని రాజేష్ ఖన్నా తెలిపారు.రాష్ట్రంలో నిర్మించనున్న వేలాది నీటి కుంటలను చేపల పెంపకానికి కూడా వినియోగించేలా ప్రభుత్వం ప్రత్యేక విధానం రూపొందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గంగపుత్రులకు చేపల పెంపకంలో ప్రాధాన్యత కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి లభించడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు జరుగుతుందని పేర్కొన్నారు.గంగపుత్రుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జలసిరి పథకం కింద నిర్మించే నీటి కుంటల్లో చేపల పెంపకానికి తమ సంఘ సభ్యులకు తగిన అవకాశం కల్పించాలని, అవసరమైన అనుమతులు, సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్కను కోరినట్లు రాజేష్ ఖన్నా తెలిపారు.గంగపుత్రుల జీవనోపాధికి ప్రభుత్వం అండగా నిలవాలని, జల వనరులను మత్స్యకారుల అభివృద్ధికి కూడా ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు

# గోదావరి తీరాన గంగపుత్రుల ఆత్మీయ సంగమం

**అక్టోబర్ 2న గోదావరిఖనిలో గంగపుత్ర సింగరేణి ఆత్మీయ సమ్మేళనం**

**ఐక్యత, ఆత్మీయత, పరస్పర సహకారానికి వేదికగా ప్రత్యేక కార్యక్రమం**

**గంగపుత్ర విద్యావంతుల వేదిక సహకారంతో సమ్మేళనం.**





గోదావరిఖని ( ప్రశ్న న్యూస్ ) పెద్దపల్లి జిల్లా గోదావరిఖని కోల్ సిటీ పరిధిలోని గోదావరి తీరంలో అక్టోబర్ 2న సింగరేణి గంగపుత్రుల ఆత్మీయ సంగమం జరగనుంది. ఈ మేరకు గంగపుత్ర సింగరేణి కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయతను పెంపొందించడంతో పాటు, పరస్పర పరిచయాలు, ఐక్యత, సహకార భావనను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో గంగపుత్ర సింగరేణి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. గోదావరిఖని సమీపంలోని గోదావరి నది తీరంలో ఉన్న లిసమ్మక్క--సారలమ్మ గద్దెలు వేదికగా అక్టోబర్ 2వ తేదీన ఉదయం 10 గంటలకు ఈ సమ్మేళనం జరగనుంది. గంగపుత్ర సమాజానికి చెందిన సింగరేణి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, యువత ఒకే వేదికపై కలుసుకునేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. సింగరేణి ప్రాంతంలో గంగపుత్ర కుటుంబాల మధ్య స్నేహభావం, ఐక్యతను పెంపొందించడంతో పాటు, భవిష్యత్‌లో సమాజ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై పరస్పరం చర్చించుకునేందుకు ఈ సమ్మేళనం వేదికగా నిలవనుంది.

**- ఆత్మీయతే లక్ష్యం.. ఐక్యతే బలం :**

ఉద్యోగ, సామాజిక, విద్యా రంగాల్లో వివిధ ప్రాంతాల్లో ఉన్న గంగపుత్ర కుటుంబాలను ఒకచోట చేర్చి ఆత్మీయంగా పలకరించుకోవడం ఈ సమ్మేళనం ప్రధాన ఉద్దేశమని సీనియర్ గంగపుత్ర నేతలు బంగారి రాజయ్య తెలిపారు. గంగపుత్రుల మధ్య ఉన్న అనుబంధాలను మరింత బలోపేతం చేసి, సమాజ పురోగతికి అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరంపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. గోదావరి నది తీరంలోని ఆహ్లాదకర వాతావరణంలో జరిగే ఈ ఆత్మీయ సమ్మేళనంలో పెద్ద సంఖ్యలో సింగరేణి గంగపుత్ర బంధువులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమాన్ని బంగారి రాజయ్య, పూస వసంత్ కుమార్, అంబటి శ్రీనివాసులు, బంగారి సారంగపాణి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. గంగపుత్ర విద్యావంతుల వేదిక సమన్వయంతో సమ్మేళనం కొనసాగనుంది.

జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

# ఉపాధ్యాయులను అవమానించేలా ఆరోపణలు సరికాదు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి.



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్ )శ్రీకాళహస్తి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డీఎస్సీపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. కష్టపడి పరీక్షలు రాసి ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన వారిపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బుధవారం మండలంలోని ఊరంధూరు గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.వైఎస్సార్‌సీపీకి 11 మంది ఎమ్మెల్యేలే ఉన్నారని, వారిలో పలువురు అసెంబ్లీకి హాజరు కావడం లేదన్నారు. అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకు అందించే జీతభత్యాలు, వసతులను నిలిపివేయాలని స్పీకర్‌ను కోరారు. రూ. 13 కోట్లతో అభివృద్ధి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రూ. 13 కోట్లతో అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు సుధీర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని టిడ్కో గృహాల్లో రెండు బ్లాకుల పనులు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేశామన్నారు. మిగిలిన బ్లాకులను కూడా పూర్తి చేసి అన్ని వసతులతో లబ్ధిదారులకు అందిస్తామని చెప్పారు. విద్యుత్తు, తాగునీరు తదితర సదుపాయాల కోసం అధికారులు చర్యలు చేపట్టారన్నారు.

**వారం రోజుల్లో స్థల ధ్రువీకరణ పత్రాలు**

పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో స్థల ధ్రువీకరణ పత్రాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులను గుర్తించి వారం రోజుల్లో పత్రాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. బియ్యపు వ్యాఖ్యలపై మండిపాటు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి స్వార్థ రాజకీయాలు చేస్తున్నారని సుధీర్‌రెడ్డి విమర్శించారు. కుమారస్వామి తిప్ప వద్ద ఓ మైనారిటీ వ్యక్తి తన స్థలంలో ఇల్లు నిర్మించుకుంటున్న అంశంపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను విమర్శించడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లను విమర్శించే అర్హత మధుసూదన్‌రెడ్డికి లేదన్నారు. ప్రజా సమస్యలపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని, స్వార్థ రాజకీయాలకు పాల్పడితే చట్టం తన పని తాను చేసుకుంటుందని హెచ్చరించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా వేగవంతంగా నిర్వహించాలి

**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశాలు**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిబంధనల మేరకు పకడ్బందీగా, పారదర్శకంగా వేగవంతంగా నిర్వహించాలని సంబంధిత ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలను, సూపర్వైసర్లను, బిఎల్ఒలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) లో భాగంగా ఇంటింటికి వెళ్లి ధృవపత్రాలను స్వీకరించి వెంటనే ఆన్ లైన్ అప్ లోడింగ్ చేయాలని, అందులో ఏలాంటి తప్పులు జరుగకుండా పటిష్టంగా, వేగవంతంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అదేశించారు. బుధవారం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ధృవపత్రాల అప్ లోడింగ్ ప్రక్రియలో భాగంగా కూకట్ పల్లి మండలంలోని ప్రగతి నగర్ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ మను చౌదరి తో కలిసి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటును నిర్ధారించే ప్రక్రియ, ఎన్నికల సంఘం నిర్ధారించిన ధృవీకరిణ పత్రాల సమర్పణ, క్షేత్రస్థాయి సహాయం, రికార్డుల పరిశీలన మరియు ధృవీకరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. బిఎల్ఓలు తప్పనిసరిగా ఇంటింటికి వెళ్లి ధృవీకరణలు స్వీకరించాలని, వారితో పాటు సూపర్ వైజర్ కూడా వెళ్లి పరిశీలించాలని సూచించారు. ధృవీకరణ పత్రాలను వెంటనే అప్ లోడ్ చేయాలని బిఎల్ఒలను ఆదేశించారు. బిఎల్ఓలు ఏవిధంగా ఆన్ లైన్ అప్లోడ్ చేస్తున్నారనే ప్రక్రియను సిఈఓ స్వయంగా పరిశీలించారు. ఏయే ధృవీకరణలు ఎక్కువగా ఇస్తున్నారని బిఎల్ఓలను అడుగగా ఎస్ఎస్సి మెమో, పాస్ పోర్టు ఎక్కువగా ఇస్తున్నారని బిఎల్ఓ సమాధానమిచ్చారు. జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిబంధనల మేరకు పకడ్బందీగా, పారదర్శకంగా వేగవంతంగా నిర్వహించాలని సంబంధిత ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలను, సూపర్వైసర్లను, బిఎల్ఒలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశించారు.అర్హత కలిగిన ఓటర్ల వివరాలు క్రమపద్ధతిలో నమోదు అయ్యేలా, సంబంధిత పత్రాల పరిశీలన లో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు తగినంత సిబ్బందిని నియమించి, రోజువారీ లక్ష్యాలు, ప్రామాణిక విధానాలు, సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో పనులను కొనసాగించాలని సూచించారు. హియరింగ్ నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలను సమీక్షించి, ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి జోనల్ కమీషనర్ మయాంక్ సింగ్, కూకట్ పల్లి తహాసీల్దార్ అశోక్, డిప్యూటి కమీషనర్, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, సూపర్ వైజర్లు , బిఎల్ఒలు తదితరులు పాల్గొన్నారు.

# 36 గంటల కోడ్ స్టార్మ్ 2026 కు విశేష స్పందన

**నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి సాంకేతిక పోటీ**





మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి పరిధిలో ని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 36 గంటల కోడ్ స్టార్మ్ 2౩26 పేరిట జాతీయ స్థాయి కోడింగ్ పోటీలు ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ అసోసియేట్ డైరెక్టర్, ఆపరేషన్ అండ్ రెసిలెన్స్ రిస్క్ స్పెషలిస్ట్, హెచ్ ఎస్ బి సి సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్. మీనాక్షి జైన్ గౌరవ అతిథులుగా ప్రొఫెసర్, కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, సైన్స్ ఢ టెక్నాలజీ డాక్టర్. కె.పి సుప్రీతి ప్రిన్సిపల్ డేటా సైంటిస్ట్ మైక్రోసాఫ్ట్ డాక్టర్. సిహెచ్ శ్రీవాత్సవ , వైస్ ప్రెసిడెంట్, హ్యూమన్, కార్పొరేషన్ రిలేషన్స్ స్కైడే సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్,. కే . వెంకట రమణ , గ్రూప్ డైరెక్టర్, సీడీసీ శ్రీనిధి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, శ్రీనిధి యూనివర్సిటీ, హైదరాబాద్, డా. వై. వాసుదేవ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మీనాక్షి ప్రసంగిస్తూ, ఇలాంటి కార్యక్రమాల వల్ల సమస్య ను పరిష్కరించే సామర్థ్యం మరియు, ఆసక్తి పెరుగుతాయని, తద్వారా అనుభవాన్ని పొందవచ్చని, నేటి కాలంలో కృత్రిమ మేధ ప్రధాన పాత్ర పోషిస్తోందని, అది కేవలం సమస్యకు పరిష్కార మార్గాన్ని మాత్రమే చూపగలదని, అదే పరిష్కారం కాదని తెలియచేశారు. అనంతరం డా. కెపి సుప్రీతి ప్రసంగిస్తూ, ప్రధానంగా భారతీయ విద్యా వ్యవస్థ మీద దృష్టి సారించాలని, భారతీయ సంస్కృతిక క్రీడలకు సాంకేతికతను జోడించాలని కోరారు. అనంతరం వాత్సవ మాట్లాడుతూ ఒక సమస్యను చిన్న చిన్న భాగాలుగా విభజించాలని, తర్వాత వాటిని అనుసంధానం చేయడం సులభమని తెలిపారు, అలాగే, ప్రతి ఫీచర్ ను ఒక ఆబ్జెక్ట్ గా అనుకోవాలని, విద్యార్థులకు పలు సూచనలు సూచించారు.అనంతరం కళాశాల డైరెక్టర్ డా ఏ మోహన్ మాట్లాడుతూ, హ్యాకథాన్ అంటే సమస్యలను పరిష్కరించడం మాత్రమే కాక, తమ నెట్‌వర్క్‌ను పెంచుకోవడానికి కూడా ఇలాంటి వేదిక ఒక అవకాశమని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా ఆర్ లోకానాథం మాట్లాడుతు, ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల విద్యార్థుల నుండి భారీ స్పందన రావడం చాలా సంతోషంగా ఉందని, చిన్న ఆవిష్కరణ కూడా మన దేశానికి గొప్ప సహకారం అవ్వగలదని తెలిపారు. 7 రాష్ట్రాల్లోని 85 కళాశాలల నుండి 580 మందికి పైగా విద్యార్థులు 145కి పైగా జట్లుగా ఈ హ్యాకథాన్ కు నమోదు చేసుకున్నారు.ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ జె నర్సింహారెడ్డి , కార్యదర్శి జె త్రిశూల్ రెడ్డి కోశాధికారి జె త్రిలోక్ రెడ్డి , డైరెక్టర్ డా ఏ మోహన్ కళాశాల ప్రిన్సిపాల్ డా ఆర్ లోకానాథం, కార్యక్రమ కన్వీనర్,సిడిసి డీన్ ప్రొ. నిఖిత రెడ్డి, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి డా. శోభన్, కో కన్వీనర్స్ గా డా. నవీన్ కుమార్ , డా. కె అనురాధ , డా. పి. దిలీప్ రెడ్డి , డీన్ ×జు శ్రీనివాస్ , ఫ్యాకల్టీ కోఆర్డినేటర్స్ గా, సిఎస్ఈ విభాగాధిపతి ప్రొ. రమేశ్ , ఏఐఎంఎల్ విభాగాధిపతి ప్రొ. జి.వి.వి. వరప్రసాద్ , సైబర్ సెక్యూరిటీ విభాగాధిపతి డా. కోటేశ్వర్ , ఐటీ విభాగాధిపతి ప్రొ. సౌమ్య , ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మయోర ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో తొలి వేతన ఒప్పందం,

**37 రోజుల సమ్మెతో సాధించిన విజయం**

**మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ జిల్లా కొంపల్లిలోని మయోర ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఇంటర్నేషనల్ కంపెనీ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన ఉద్యమం ఫలితంగా వేతన ఒప్పందం కుదిరిందని మాజీ మంత్రి బి ఆర్ డి యు అధ్యక్షులు వి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.కార్మికుల సమస్యలు, వేతన ఒప్పందం తదితర అంశాలపై కంపెనీ యాజమాన్యంతో వి శ్రీనివాస్ గౌడ్ పలుమార్లు సమావేశమై చర్చించినప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కార్మికులు సమ్మెకు వెళ్లారని, బి ఆర్ టి యు యూనియన్ ఆధ్వర్యంలో 37 రోజుల పాటు నిర్వహించిన సమ్మె అనంతరం యాజమాన్యం కార్మికుల డిమాండ్లపై సానుకూలంగా స్పందించిందన్నారు.మయోర ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చరిత్రలో గత 15 సంవత్సరాల్లో తొలిసారిగా రూ. 10,800 వేతన పెంపుతో ఒప్పందం కుదరడం కార్మికుల ఐక్య పోరాటానికి నిదర్శనమని వి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఈ వేతన ఒప్పందం కార్మికుల హక్కుల కోసం నిర్వహించిన ఉద్యమానికి లభించిన ఫలితమని అన్నారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ టి యు వర్కింగ్ ప్రెసిడెంట్ మాయ రాజయ్య, అడ్వైజర్ కె సత్యప్రసాద్, జనరల్ సెక్రటరీ జె సంతోష్ కుమార్, బి జనార్ధన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కె. నర్సింహులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి శ్రీను, జాయింట్ సెక్రటరీ ఎ మహేష్, కోశాధికారి సిహెచ్ ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణానికి అనుగుణంగా పంటలు ఎంపిక చేసుకోవాలి

**రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎమ్. కోదండ రెడ్డి**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )వాతావరణానికి అనుగుణంగా పంటలు ఎంపిక చేసుకొని, వ్యవసాయంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడం ద్వారా నీటి వనరులను ఆదా చేయడంతో పాటు భూసారాన్ని కాపాడవచ్చని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎమ్. కోదండ రెడ్డి అన్నారు.బుధవారం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కిసాన్ మేళా కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి, రైతు సంక్షేమ కమిషన్ మెంబర్ భవానీ రెడ్డి లతో కలసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కిసాన్ మేలను ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం దృష్ట్యా రైతులు పంట మార్పిడి చేసుకోవాలని తెలిపారు. అందులో భాగంగా ఉద్యాన పంటలు సాగు చేసుకోవాలన్నారు. ఉద్యాన పంపటలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు ఇస్తున్నాయని కూడా ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రకృతి వ్యవసాయం, జీవ ఎరువులు, జీవ పురుగుమందులు, వివిధ ప్రభుత్వ వ్యవసాయ పథకాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. జిల్లా లో అందిస్తున్న వివిధ రకాల సబ్సిడీ పథకాల గురించి రైతులకి తెలియజేశారు. జిల్లా స్థాయి కిసాన్ మేళా ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికత, వ్యవసాయ ఉత్పత్తులు ప్రభుత్వ కార్యక్రమాలపై ఉపయోగకరమైన సమాచారం అందించబడింది. మిల్లెట్, పండ్లు, కూరగాయలు వైపు మొగ్గుచూపలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాల లో గ్రీన్ ఎరువు విత్తనం, ఫెర్టిలైజర్ బుకింగ్ అప్లికేషన్, రైతు భరోసా, రైతు భీమా, సాయిల్ హెల్త్ కార్డ్రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిని వ్యవసాయ స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఆర్టిఏ కమిటీ సభ్యులు జైపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ లు జాము రవి, శ్రీదేవి, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ సిబ్బందికి సన్మానం.



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా శ్రీకాళహస్తిలో అంగన్వాడీ ఉత్సవాన్ని నిర్వహించారు. ముత్యాలమ్మ గుడి కళ్యాణ మండపంలో సీడీపీఓ శాంతిదుర్గ ఆధ్వర్యంలో బుధవారం కార్యక్రమం జరిగింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ హాజరయ్యారు. అంగన్వాడీ సిబ్బంది, లబ్ధిదారులను సన్మానించి పసుపు, కుంకుమ, చీర, జాకెట్‌తో కూడిన వాయినాలను అందజేశారు.ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోదీ సుదీర్ఘకాలంగా ప్రజాసేవకు అంకితమై సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు.పార్టీ ఆదేశాల మేరకు అంగన్వాడీ సిబ్బంది, లబ్ధిదారులను సన్మానించి వాయినాలు అందజేసినట్లు తెలిపారు.సీడీపీఓ శాంతిదుర్గ మాట్లాడుతూ.సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు,సిబ్బంది, లబ్ధిదారులకు వాయినాలు అందించిన కోలా ఆనంద్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో

# బస్సు గుర్తుకే ఓటు వేయాలి

**- ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఉట్నూర్ డిపో దగ్గర ఎన్నికల ప్రచారం లో భాగంగా ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఈదురు వెంకన్న , టీఎంయూ రాష్ట్ర అధ్యక్షులు ఏఆర్ రెడ్డి, ఎన్నికల్లో గెలుపే లక్ష్యం, కార్మికులకి దిశా నిర్దేశనం చేశారు. గత ప్రభుత్వం సంఘాల ను పక్కన పెట్టి, కార్మికుల హక్కులను అమలు చేయకుండా, ఆర్థిక ప్రయోజనలు ఇవ్వకుండా తీవ్ర మనోవేదన కి గురి చేస్తే జేఏసీ ఏర్పాటు చేసి కార్మికులలో ధైర్యం నింపి, పోరాటం చేస్తూ, చివరి జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె కి దిగి రావాల్సిన,ప్రభుత్వం విలీనం, పి ఆర్ సి, పెండింగ్ సమస్య లు పరిష్కారం దిశగా కృషి చేయడం జరిగింది..ప్రభుత్వం లో విలీనం కావాలన్న, విలీన సమస్య లు లేకుండా ఉండలన్న, ఎంప్లాయిస్ యూనియన్ మరియు థామస్ రెడ్డి టి ఏం యు ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు . కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ టి ఏం యు నాయకులు పాల్గొన్నారు

## పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎస్పీ అభినందనలు

**- ముఖ్యమంత్రి జిల్లా పర్యటన విజయవంతం**



**సిరిసిల్ల (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లతో పర్యటన విజయవంతంగా ముగిసిందనిఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈ సందర్భంగా బందోబస్తు విధుల్లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరినీ ఎస్పీ హృదయపూర్వకంగా అభినందించారు. విధుల నిర్వహణలో సమన్వయంతో, అంకితభావంతో పనిచేసిన సిబ్బందిని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే సేవా స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించాలని అన్నారు.

## బీసీ అంటే వెనుకబడిన కులం కాదు..

# వెన్నెముక ఉన్న జాతి

**- రాజ్యాంగం చెప్పిన హక్కు**



(అలేఖ్య పేరం , బీసీ మహిళా రాష్ట్ర కన్వీనర్, హైకోర్టు న్యాయవాది)

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** 55 శాతం జనాభా ఉన్న మనం ఈ రాష్ట్రానికి పునాది. పొద్దున్న లేస్తే మన చేతితోనే ఈ సమాజం నడుస్తుంది. మనం లేకుండా ఈ రాష్ట్రంలో ఒక్క రోజు గడవదు.

### మరి అధికారం ఎవరిది.?

మన హక్కును రాజ్యాంగమే చెబుతోంది - తెలుసుకోండి బీసీ బిడ్డలారా! లెక్క తేలాల్సిందే - ఇది మన రాజ్యాంగ హక్కు: ఆర్టికల్ 340: రాష్ట్రపతి వెనుకబడిన తరగతుల పరిస్థితిని పరిశీలించడానికి కమిషన్ వేయాలని చెబుతుంది. అంటే బీసీలు ఎంతమంది ఉన్నారో, వారి పరిస్థితి ఏమిటో లెక్క తేల్చడం ప్రభుత్వ బాధ్యత.ఆర్టికల్ 15(4) & 16(4): సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం, ఉద్యోగాల్లో, విద్యలో ప్రత్యేక వసతులు కల్పించాలని రాజ్యాంగం స్పష్టంగా చెబుతోంది. లెక్క తెలియకుండా వాటా ఎలా ఇస్తారు? అందుకే బీసీ కులగణన మా జన్మహక్కు.

### అధికారమే పరిష్కారం - చట్టసభల్లో మా వాటా ఎక్కడ?

ఆర్టికల్ 243-డి & 243-టి: పంచాయతీల్లో, మున్సిపాలిటీల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని రాజ్యాంగం చెబుతోంది. కానీ అసెంబ్లీ, పార్లమెంట్ లో ఎందుకు లేదు? మనకు 100 పథకాలు వద్దు. ఆర్టికల్ 14 - సమానత్వపు హక్కు ప్రకారం మాకు రాజకీయ సమానత్వం కావాలి. 50% జనాభా ఉన్న మాకు 50% టికెట్లు ఇవ్వాల్సిందే.

### మనమంతా ఒక్కటే - విడగొట్టే కుట్రను తిప్పికొడదాం:

మనల్ని 112 కులాలుగా విడగొట్టి రాజ్యం ఏలుతున్నారు. కానీ ఆర్టికల్ 342ఏ ప్రకారం బీసీలందరం ఒకే జాబితా. మనమంతా ఒక్కటే జాతి. బీసీ అంటే బలహీనుడు కాదు. బీసీ అంటే ఈ నేల బలం. సర్దార్ సర్వాయి పాపన్న పోరాట వారసులం మనం.

### డిమాండ్స్:

1. వెంటనే బీసీ కులగణన (ఆర్టికల్ 340 ప్రకారం) చేపట్టాలి.
2. స్థానిక సంస్థల నుండి చట్టసభల వరకు బీసీలకు 50% రిజర్వేషన్ అమలు చేయాలి.
3. ఆర్టికల్ 21 - జీవించే హక్కు ప్రకారం, బీసీ కులవృత్తులకు రక్షణ, కార్పొరేషన్లకు నిధులు పెంచాలి. ఇక భయపడొద్దు. రాజ్యాంగం మన పక్షాన ఉంది. న్యాయం మన పక్షాన ఉంది.

బీసీలు తిరగబడితేనే - తెలంగాణకు నిజమైన స్వాతంత్ర్యం! జై బీసీ జాతి! జై తెలంగాణ! జై భారత రాజ్యాంగం!

# పోరాటాలతో హక్కులు సాధించుకోవాలి

# ఆడుకోవడం దురదృష్టకరం

- ప్రభుత్వ ఉదాసీన వైఖరితో అగమ్యగోచరంగా ఉద్యోగుల పరిస్థితి - సమస్యలు పట్టని ఉద్యోగ సంఘాల నేతలు
- సంవత్సరాలుగా అందని బకాయిలతో ఉద్యోగుల వెతలు - పీఆర్సీ, డిఏ లు ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఇచ్చేవి కాదు
- పాలకుల పల్లకీలు మోస్తే సమస్యల సాధన సాధ్యమేనా - లక్షలాది మంది ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీస్తున్న ఉద్యోగ సంఘాల జైఏసీ నేతలు
- హక్కుల సాధనకు బేరసారాలు, పడిగాపులు, అడుకోవడాలు కాదు పోరాటాలతోనే అంతిమ విజయం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** విజయవంతమైన ఉద్యోగ సంఘాల జేఏసీ వైఫల్యాలతో ఏళ్ళు గడుస్తున్నా ఉద్యోగులకు కన్నీళ్లు ఆగడం లేదు.ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఉద్యోగుల తలరాతలు మారతాయో లేదో కానీ, ఉద్యోగ సంఘ నాయకుల శాలువాలు, పూలదండలు మాత్రం ఖచ్చితంగా మారుతుంటాయనడంలో సందేహం లేదు. కార్యకర్తల చందాలతో నడిచే సంఘాలు, సామాన్య ఉద్యోగుల ఆక్రందనలను పాలకుల పాదాల చెంత తాకట్టు పెట్టి చారిత్రక చర్చలు ఫలించాయి అంటు ఉదరగొడుతు చిరునవ్వులతో హోరెత్తించి ఉద్యోగులను నట్టేట ముంచుతున్నారు. ప్రాథమిక సభ్యుడి ఆక్రందనను, జేఏసి నాయకత్వపు కదలికలను విశ్లేషిస్తే కనిపించేది ఉద్యమ చరిత్ర కాదు, అడుగడుగున రాజీపడిన అవగాహననే కనిపిస్తుంది.

**ఆర్నెల్లకోసారి ఇచ్చే కరువు భత్యం కోసం మూడేళ్లు ఎదురుచూపులు**

**ఆరు డీఏలకు గాను రెండు విసిరితే, అది గొప్ప విజయం సాధించినట్లు పాలాభిషేకాలు, వంగోంగి దండాలు.**

**హక్కులను అడుకోవడమేంటి**

ఉద్యోగికి డీఏ అనేది రాజ్యాంగబద్ధమైన హక్కు, ప్రభుత్వం ఇచ్చే ఉచిత పథకం కాదు. ఆరు డీఏలు పేరుకుపోయి, ద్రవ్యోల్బణంతో జీవితాలు కరిగిపోతుంటే రెండు డీఏలు ఇచ్చి దసరా కానుకగా ప్రకటనలు గుప్పించడం సిగ్గుమాలిన పని. మిగిలిన నాలుగు డీఏల సంగతేంటి అని ప్రభుత్వాన్ని నిలదీసే ధైర్యం లేని మన నాయకత్వం, రెండు డీఏల జీవో కాపీలతో ఫోటో పోజులివ్వడం దిగజారుడుతనానికి నిదర్శనం.

### పీఆర్సీ మాటేంటి

పీఆర్‌సీ అంటే పే రివిజన్ కమిషన్ స్థానంలో పేషెన్స్ రివ్యూ కమిషన్ (ఉద్యోగుల సహనాన్ని పరీక్షించే ఓ అంతులేని ప్రహసనం) అంటే సముచితంగా ఉంటుందని పలువురు ఉద్యోగులు నిట్టూర్చడం గమనార్హం. రెండు డిఏ ల కోసమేనా హైదరాబాద్ ముట్టడి, నిరాహారదీక్షల ప్రకటనలు. మరి సాధించిన మని చెప్పుకుంటున్న డిఏలతో పాటు పీఆర్సీ విషయంలో ప్రభుత్వాన్ని ఎందుకు నీలదీయకపోయారో నాయకులు వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

### పీఆర్సీ పై 39 నెలలుగా నిరీక్షణ

పీఆర్సీ గడువు ముగిసి మూడేళ్లు దాటినా, కమీషన్ల మీద కమిటీలు వేస్తూ కాలయాపన చేస్తు చూస్తాం, చేస్తాం అనే పాలకుల మాటలను వేదవాక్కుగా భావించి మూగబోయిన నాయకుల గొంతులు సగటు మధ్యతరగతి ఇచ్చే సందేశమేందని పలువురు ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. గడువు దాటిన వేతన సవరణ సంఘం (పీఆర్సీ కమిటీ) ఉలుకు పలుకు లేని పరిస్థితుల్లో ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేయాల్సిన మన నాయకులు పాలకుల చుట్టు ప్రదక్షిణలు చేస్తు ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహారం ఎంత వరకు సమంజసం.

### ఓట్ల కోసంమే ఓపీఎస్ హామీ

కమిటీల అధ్యయనలతో కాలక్షేపం, నాయకులకేమో పదవుల విందు భోజనాలు, ఉద్యోగికేమో సీపీఎస్ పొగ పెడుతున్న హామీలతో ఒరిగిందేంటి అని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. లక్షా ముప్పై వేల మంది కుటుంబాల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన సీపీఎస్ రద్దుపై ఎన్నికల ముందు ఎన్నెన్నో వాగ్దానాలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక మరో కమిటీని వేస్తాం, మూడు నెలల్లో పరిశీలిస్తాం అంటే దాన్ని కూడా గొప్ప విజయంగా చిత్రీకరించే బానిస మనస్తత్వం ఉద్యోగ నాయకత్వానికి ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. సీపీఎస్ ఉద్యమం రక్తమోడుతుంటే, జేఏసి నాయకులు ఏసీ రూముల్లో సేదతీరుతు ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని కూడా అర్థం చేసుకోవాలి అంటూ ప్రభుత్వంపై సానుభూతి వ్యక్తం చేస్తే మన హక్కులను సాధించుకోవడం సాధ్యమేనా అనే అనుమానాలు కలుగుతున్నాయని విచారం వ్యక్తం చేస్తున్నారు.

### అందని ద్రాక్షగా ఈఎచ్ఎస్ అమలు

క్యాష్ లెస్ ట్రీట్ మెంట్ అంటు ఉదరకొడుతు ఉద్యోగుల జీతాల నుండి 1.5 శాతం కట్ చేసుకున్న డబ్బులు ఎటు పోతున్నాయో తెలియని పరిస్థితి. ఏ ఆస్పత్రికి వెళ్లినా ఈఎచ్ఎస్ కార్డులు పనిచేయడం లేదు. మరి ప్రభుత్వం చెపుతున్న ఈఎచ్ఎస్ అమలు ఎక్కడ జరుగుతుందని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. జబ్బుతో కార్పోరేట్ హాస్పిటల్ లో కాలు పెడితే పట్టించుకునే నాథుడే లేడు. మరి ఉద్యోగుల జీతం నుండి మినహాయించే డబ్బులు ఎక్కడికి వెళ్తున్నాయో తెలియని దుస్థితి. అలాగే ఉద్యోగుల జీతాల నుండి మినహాయించే డబ్బుకు సమానంగా ప్రభుత్వం జమచేయాల్సిన డబ్బు ఎంత వరకు జమచేస్తున్నారో తెలియని అయోమయ పరిస్థితి. ఇదీ నేటి తెలంగాణ ఉద్యోగి దయనీయ స్థితి. ఇక జీతాల నుండి జమ అయిన మొత్తాన్ని ఖజానా అవసరాలకు వాడుకుంటుంటే ఉద్యోగ సంఘాల నాయకులు నోరు మెదపక పోవడంలోని అంతర్యమేందో తెలియని విషయం. అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ దవాఖానలకు వెళ్తే అమలు కాని ఈఎచ్ఎస్ తో ఇబ్బంది పాలవుతున్నా లక్షలాదిమంది ఉద్యోగుల ప్రాణాలకు రక్షణ కల్పించలేని నాయకులు, వేదికలపై పోరాటాలు, నిరసనలంటు ఎవరిని మోసం చేస్తున్నారో ఉద్యోగులు అర్థం చేసుకోని మన హక్కుల కోసం సంఘాల ప్రమేయం లేకుండా సమిష్టిగా నిప్పు కణికలమై దూసుకెళ్లే సమయం ఆసన్నమైందని పలువురు మండిపడుతున్నారు.

### సంవత్సరాలుగా అందని బకాయిలు - ఉద్యోగుల వెతలు

సంవత్సరాలుగా పేరుకు పోయిన ఉద్యోగుల బకాయిల డబ్బు ఎప్పుడు చేతికి ఆందుతుందో తెలియని అయోమయం నెలకొంది. తాము జీతంలో కొంత డబ్బును మినహాయించుకొని దాచుకున్న డబ్బును ప్రభుత్వం ఖజానాకు వాడుకొని ఉద్యోగుల అవసరాలకు అందించక పోవడం ఎంతవరకు సమంజసం. పిల్లల చదువులు, పెళ్ళిళ్ళు, అనారోగ్య సమస్యలు, ఇతర అత్యవసరాలకు ఉపయోగపడుతుందని జమ చేసుకున్న డబ్బు చేతికందకపోవడంతో ఉద్యోగుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

మరి ఉద్యోగుల బకాయిల విషయంలో సంఘాల నేతలు ఎందుకు నోరు మెదపడం లేదని పలువురు సరెండర్ లీవులు, జీపీఎఫ్ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. రుణాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఏళ్ల తరబడి పెండింగ్‌లో పడి ఉద్యోగి పైసాపైసా కోసం కాళ్లరిగేలా తిరుగుతుంటే, ప్రస్తుతానికి కుదరదు అని ప్రభుత్వం చేతులెత్తేస్తే కనీసం నిరసన తెలపలేని నాయకత్వా వైఫల్యాని సలామ్ చేయాలి. జిల్లా, రాష్ట్ర నాయకుల హోదాలు, వారి వాహనాలపై సంఘ గుర్తింపు బోర్డులు, ప్రభుత్వంతో కూర్చునే ప్రోటోకాల్ దక్కేది కేవలం క్షేత్రస్థాయిలో పనిచేసే ప్రాథమిక సభ్యుల చందాలు, వారి మద్దతు వల్లే. ఆ సభ్యుడే రోడ్డున పడి, ఆర్థిక పరిస్థితి క్షీణించి అప్పుల ఊబిలో కూరుకుపోతుంటే, కనీస సమస్యలను పరిష్కరించలేని నాయకత్వం ఉంటే ఎంత ఊడితే ఎంత అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంఘాల నేతలు ఆత్మపరిశీలన చేసుకోని పాలకుల పల్లకీలు మోసే ప్రభుత్వ అనుకూల ధోరణి వీడి, నిజమైన పోరాటాలతో ఉద్యోగుల కడుపుమంటను చల్లార్చే ప్రణాళికను సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. లేదంటే ప్రాథమిక సభ్యుడే సంఘాల సభ్యత్వాలను రద్దు చేసుకుని, స్వయంగా రోడ్డెక్కి నాయకుల బండారాన్ని బద్దలు కొట్టే రోజు మరింత దూరంలో లేదని హెచ్చరిస్తున్నారు.

## హైదరాబాద్ కమిషనరేట్‌లో 18 మంది

# పోలీసు అధికారుల పదవీ విరమణ






**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 42 సంవత్సరాల పాటు సేవలందించిన 18 మంది పోలీసు అధికారులు బుధవారం పదవీ విరమణ పొందారు. బంజారాహిల్స్ లోని టీజీఐసీసీసీ ఆడిటోరియంలో వారికి ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ పదవీ విరమణ పొందిన అధికారులను శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలతో పాటు సొసైటీ తరపున అందించే రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను అందజేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం లభించే ఆర్థిక ప్రయోజనాల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధిక వడ్డీల ఆశతో ప్రైవేట్ వ్యక్తులు, మోసపూరిత సంస్థల చేతుల్లో పడకుండా ఆ నిధులను సురక్షితమైన ప్రభుత్వ రంగ సంస్థల్లోనే డిపాజిట్ చేసుకోవాలని హితవు పలికారు. అలాగే తమ ‘సెకండ్ ఇన్నింగ్స్’లో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పదవీ విరమణ చేసిన వారికి కుటుంబ సభ్యులు అండగా ఉంటూ సహకరించాలని కోరారు.పదవీ విరమణ పొందిన వారిలో ఏసీపీలు పత్తిపాటి విక్రమ్ దేవ్ (సీటీసీ), రాయకూర్ సంజయ్ కుమార్ (సైఫాబాద్)లతో పాటు ఐదుగురు ఎస్సైలు, ఆరుగురు ఏఎస్సైలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఒక కానిస్టేబుల్, ఇద్దరు ఎల్‌జీఎస్ సిబ్బంది ఉన్నారు.విధి నిర్వహణను విజయవంతంగా ముగించుకున్న వీరిని హైదరాబాద్ సిటీ పోలీస్ తరపున తరఫున సగౌరవంగా వారి నివాసాల వద్ద దింపేందుకు ప్రత్యేకంగా ప్రభుత్వ వాహనాలను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో డీసీపీ (అడ్మిన్) కె.వెంకటలక్ష్మి, సీఏడీవో జేబీజే ఆనంద్ కుమార్, సీఏవో చంద్రకళ, ఏవో యాదగిరి, పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, సొసైటీ కార్యదర్శి నల్ల శంకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎండీ ఆసిఫ్ ఖాన్, కోశాధికారి జి.ఎం.ఎస్.విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# పరిపాలనలో నిబద్ధత

**- సేవలో మానవీయత**

**- జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ బి.ఎస్. లతకు ఆత్మీయ వీడ్కోలు**



**జగిత్యాల(ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ ఉద్యోగం ఒక బాధ్యత, అధికార పదవి ఒక అవకాశం, ఆ అవకాశాన్ని ప్రజలకు ఎంత ఉపయోగకరంగా మలుస్తామన్నదే ఒక అధికారిణి సేవా ప్రస్థానానికి అసలైన కొలమానం. అలాంటి బాధ్యతాయుతమైన సేవా దృక్పథంతో విధులు నిర్వర్తిస్తూ, జగిత్యాల జిల్లా పరిపాలనలో తనదైన ముద్ర వేసిన జిల్లా అడిషనల్ కలెక్టర్ బి.ఎస్. లత పదవీ విరమణ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు, ప్రజలు ఆమెకు ఆత్మీయ వీడ్కోలు పలుకుతున్నారు.

### పదవి కంటే బాధ్యతకు ప్రాధాన్యం

అధికార హోదా వచ్చినప్పుడు ఆ హోదాను ఆస్వాదించడం కంటే, దానికి అనుగుణంగా బాధ్యతలను నిర్వర్తించడమే ముఖ్యమనే భావనతో బి.ఎస్. లత తన విధులను కొనసాగించారు.ప్రభుత్వ కార్యక్రమాల అమలు, పరిపాలనా వ్యవహారాల పర్యవేక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం, వివిధ శాఖలతో సమన్వయం వంటి అంశాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించడం ఆమె సేవా ప్రస్థానంలో ప్రత్యేకతగా నిలిచింది.

### ప్రజల మాట వినే మనసు - సమస్యను అర్థం చేసుకునే దృష్టి

ప్రజా పరిపాలనలో అత్యంత ముఖ్యమైనది ప్రజల మాట వినడం. సమస్యను పూర్తిగా అర్థం చేసుకోకుండా నిర్ణయం తీసుకోకూడదనే మానవీయ దృక్పథంతో వ్యవహరించిన అధికారిణిగా ఆమెను సహచరులు, సిబ్బంది గుర్తుచేసుకుంటున్నారు.ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు వచ్చినప్పుడు ఓపికగా ఆలకించడం, సంబంధిత అంశాలపై అధికారులతో చర్చించడం, సాధ్యమైన పరిష్కార మార్గాలను అన్వేషించడం వంటి విధానం ఆమెకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.

# అక్రమ మైనింగ్‌తో అంతరించిపోతున్న దేవతలగుట్ట

**- నిత్యం పేళ్ళుళ శబ్దాలతో వణికిపోతున్న స్థానికులు - అటువైపు కన్నెత్తి చూడని రెవెన్యూ, మైనింగ్ అధికారులు**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎంతో చారిత్రాత్మక నేపథ్యం ఉన్న దేవతల గుట్టపై పాలకులు, సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో గుట్టపై ఉన్న పలు దేవాలయాలతో పాటు గుట్ట సరిహద్దుల ఆనవాళ్లు కూడా మిగిలే పరిస్థితులు లేకుండా పోయాయి. దేవతలగుట్టకు సంబంధించిన భూములు ఆర్‌సిఐ, భూదాన్, యూఎల్‌సీ (అర్బన్ ల్యాండ్ సీలింగ్) తో పాటు దేవతలగుట్ట దేవాలయ ఆధీనంలో ఉన్నట్లు సమాచారం. అయితే ఆర్‌సీఐ ఆధీనంలోని భూముల చుట్టు కంచే నిర్మాణం చేసుకోగా మిగిలిన భూదాన్, యూఎల్‌సీ భూములలో అక్రమ మైనింగ్ జరుపుతు శక్తివంతమైన డైనమెంట్స్ తో భారీ పేళ్లుళ్ళకు పాల్పడుతుండటం వల్ల సమీపం కాలనీల్లో నివసిస్తున్న ప్రజల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఇక గుట్టపై సహజసిద్ధంగా ఏర్పడిన జలగుండంలో సంవత్సరం పొడవునా నీరు ఉండటం గొప్ప విశేషం. అనేక ఔషధ మొక్కలకు ఆలవాలమైన ఈ గుట్ట చుట్టుప్రక్కల ప్రాంతాల వారికి అపర సంజీవినిగా పేరుగాంచింది. 1677 సంవత్సరంలో చత్రపతి శివాజీ మహారాజ్ శ్రీశైల మల్లికార్జునుడిని దర్శించుకునేందుకై





హైదరాబాద్ మీదగా ప్రయాణిస్తున్న సమయంలో దేవతలగుట్టను సందర్శించారని చరిత్ర ఆధారంగా ఉన్నట్లు సమాచారం. ఇలాంటి అత్యంత అరుదైన దేవతల గుట్ట ఉనికి అక్రమ మైనింగ్ వల్ల ప్రశ్నార్థకంగా మారిపోయింది. గుట్టపై ఉన్న బండరాళ్లను శక్తివంతమైన డైనమెట్స్ తో పేల్చి గుట్టను త్రవ్వుతుండటం వల్ల సమీపంలోని కాలనీల్లో నివాసముంటున్న ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గుట్టపై కొందరు వ్యక్తులు అక్రమ మైనింగ్ చేస్తు తీవ్ర స్థాయిలో పేళ్ళుళకు పాల్పడుతున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. ఇప్పటికే కొండ వెనక భాగంలో విలాసవంతమైన విల్లాలు, కాలనీలు, వెంచర్లు, పుట్టుకు రావడంతో గుట్టపై పర్యావరణ అనుమతులపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ఏదేమైనా గుట్టపై తవ్వకాలు జరుపుతు అత్యంత శక్తివంతమైన పేళ్లుళకు పాల్పడుతుండటంతో సమీప కాలనీలో నివసించే ప్రజలు తీవ్ర భయాందోళనలతో వణికిపోతుండటమే కాక పేళ్లుళ ప్రకంపనాల తీవ్రతతో ఇండ్ల పునాదులో వత్తిడి ఏర్పడి ఇండ్ల బీటలు వారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై శ్రీసాయి బాలాజీ హోమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున మీర్‌పేట్, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. అయితే పోలీసుల నుండి ఎలాంటి స్పందన లేకపోను మరింత తీవ్రస్థాయిలో యధావిధిగా పేళ్ళుళు జరుగుతుండడం ఆందోళన కలిగించే విషయమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేల సంవత్సరాల పైబడిన చరిత్రతో ప్రసిద్ధిగాంచిన దేవతలగుట్టపై జరుగుతున్న అక్రమ మైనింగ్ వల్ల మరికొద్ది రోజుల్లోనే గుట్ట ఆనవాళ్లు లేకుండా మాయం కావటం తథ్యమని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఒకప్పుడు పచ్చని వృక్షాలతో అహ్లాధకర వాతావరణంలో ఉన్న గుట్ట నేడు పేళ్లుళ దాటికి శిధిలమై బండరాళ్లతో మట్టి దిబ్బగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వేల సంవత్సరాల చరిత్ర కలిగిన దేవతలగుట్టపై జరుగుతున్న అక్రమ మైనింగ్, భారీ పేళ్ళుళ్లపై విచారణ జరిపి అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# పేదలకు గరిష్ఠ ప్రయోజనం

**- పాలనపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు**




అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను సమన్వయం చేయడం ద్వారా పేదలకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పాలనలో నాణ్యత, పారదర్శకతను పెంపొందించేందుకు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులకు కూడా ఐఐఎం, ఐఐటీల వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో శిక్షణ ఇప్పించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. బుధవారం 'పేదల సేవలో - సంక్షేమ కార్యక్రమాల కన్వర్జెన్స్' అనే అంశంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆయన జూమ్ వేదికగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రతి పేద కుటుంబానికి సగటున 4 నుంచి 5 పథకాలు అందుతున్నాయని, స్త్రీశక్తి, తల్లికి వందనం, దీపం వంటి పథకాలన్నింటినీ సమన్వయం చేసి లబ్ధిదారులకు మరింత అండగా నిలవాలని సూచించారు. పేదరికం, ఆర్థిక అసమానతలు లేని నియోజకవర్గాలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేయాలని స్పష్టం చేశారు. పీ4 (ప్రజలు-ప్రభుత్వం-ప్రైవేటు భాగస్వామ్యం) మోడల్ అమలు తీరును నిరంతరం పర్యవేక్షించాలని, ఇందుకోసం సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ తరహా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికే 11 లక్షల బంగారు కుటుంబాలకు మార్గదర్శకులు పీ4 కార్యక్రమం కింద చేయూతనిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పాలనలో సాంకేతికతను జోడించడం ద్వారా పౌర సేవలను మరింత సులభతరం చేయవచ్చని సీఎం పేర్కొన్నారు. సేవలను సమర్థంగా అందించడం ద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూల దృక్పథం (పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్) పెరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులతో పాటు ప్రతి ఉద్యోగికి కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్లు, నోడల్ అధికారులు క్షేత్రస్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని, తమ ప్రభుత్వం పొలిటికల్ గవర్నెన్స్‌కే అత్యంత ప్రాధాన్యమిస్తుందని స్పష్టం చేశారు. డ్వాక్రా మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం 'స్వయం బ్రాండ్'ను ప్రోత్సహిస్తున్నామని, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి వివరించారు. పల్లె పండుగ-3.0 ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆస్తులు కల్పించబడతాయని, అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకత తప్పనిసరి అని ఆదేశించారు. ఏటా అక్టోబర్ 2వ తేదీన రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో 'స్వచ్ఛాంధ్ర అవార్డులు' ప్రదానం చేయనున్నట్లు ప్రకటించారు. ద్రవ్యోల్బణ భారం ప్రజలపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, రైతు బజార్లలో తక్కువ ధరకు ఉల్లిని అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనలో ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే ఆదర్శంగా నిలపడమే తమ అంతిమ లక్ష్యమని, ఇందుకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని సీఎం పిలుపునిచ్చారు.

# చెత్త సేకరణ ఆటోలు మూలన పడ్డట్టేనా.?

**- మరమ్మతులు చేయించరా.? చేయించలేరా.? - ప్రజా సొమ్ము దుర్వినియోగమా, అధికారుల నిర్లక్ష్యమా.? - ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎక్కడ.?**




**జవహర్‌నగర్ (ప్రశ్న న్యూస్)** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజల నుంచి చెత్త సేకరించేందుకు వినియోగించాల్సిన ఆటోలు మూలనపడి ఉండటం అనేక ప్రశ్నలకు తావిస్తోంది. ప్రజల పన్నుల రూపంలో సమకూరే నిధులతో కొనుగోలు చేసిన వాహనాలు వినియోగంలో లేకుండా మరమ్మతుల పేరుతో నిరుపయోగంగా పడి ఉంటే, వాటి నిర్వహణపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది.



### చెత్త సేకరణ వాహనాలే మూలనపడితే.. చెత్త సేకరణ ఎలా.?

ఇళ్ల నుంచి ప్రతిరోజూ చెత్త సేకరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత మున్సిపల్ యంత్రాంగంపై ఉంది. అయితే చెత్త సేకరణకు ఉపయోగించాల్సిన ఆటోలే వార్డు పరిధుల్లో మూలనపడి ఉంటే పారిశుద్ధ్య నిర్వహణ ఎలా సాగుతుందనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. వాహనాలు పనిచేయకపోతే వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై లేదా.?

### మరమ్మతులు చేయించలేరా.. లేక పట్టించుకోవడం లేదా.?

వాహనాలకు చిన్నపాటి మరమ్మతులు అవసరమైతే వాటిని సకాలంలో చేయించాల్సి ఉంటుంది. వాహనం పూర్తిగా పనికిరాని స్థితిలో ఉంటే దాని స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. కానీ వాహనాలను సక్రమంగా మెంటెనెన్స్ చేయక మూలన పడ్డాయన్న విమర్శలు ఉన్నాయి. అలాగే వదిలేయడం వల్ల ప్రజాధనం పెట్టి కొనుగోలు చేసిన ఆస్తులు క్రమంగా నిరుపయోగంగా మారే ప్రమాదం ఉంది. అసలు ఈ వాహనాలు ఎప్పటి నుంచి వినియోగంలో లేవు.? వాటి మరమ్మతులకు ఎంత ఖర్చు అవసరం.? మరమ్మతుల కోసం నిధులు కేటాయించారా.? కేటాయించి ఉంటే పనులు ఎందుకు జరగలేదు.? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలని స్థానికులు కోరుతున్నారు.

### ప్రజా సొమ్ముకు బాధ్యత ఎవరిది.?

ప్రభుత్వ వాహనం అంటే ప్రజా ఆస్తి. దాని నిర్వహణ, వినియోగం, మరమ్మతులు, ఇంధనం, డ్రైవర్ విధులు తదితర అంశాలపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయాలి. వాహనాలు పనిచేయకుండా నెలల తరబడి పడి ఉంటే వాటి వల్ల ప్రభుత్వానికి కలిగే నష్టాన్ని ఎవరు భరిస్తారు.? ప్రజాధనంతో కొనుగోలు చేసిన ఆస్తులను సంరక్షించడంలో వైఫల్యానికి బాధ్యత ఎవరిది.? అన్నది స్పష్టం కావాల్సి ఉంది.

### కీసర సర్కిల్ అధికారుల పర్యవేక్షణ ఎక్కడ.?

జవహర్‌నగర్ పరిధిలోని పారిశుద్ధ్య వ్యవస్థపై కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ స్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాల్సి ఉంది. వార్డు కార్యాలయాల్లో వాహనాల పరిస్థితి, సిబ్బంది హాజరు, చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనులపై క్షేత్రస్థాయిలో తనిఖీలు జరుగుతున్నాయా.? అన్నది స్థానికుల ప్రశ్న. సమస్యలు ఉన్నా ఉన్నతాధికారుల దృష్టికి రాకపోవడం ఎలా సాధ్యమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.




### జోనల్ కమిషనర్‌కు కనిపించవా.?

సర్కిల్ స్థాయి అధికారుల పర్యవేక్షణతో పాటు జోనల్ స్థాయిలో కూడా పారిశుద్ధ్య వ్యవస్థను సమీక్షించాల్సిన అవసరం ఉంది. మూలనపడి ఉన్న వాహనాలు, పనిచేయని పరికరాలు, చెత్త సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై జోనల్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారా.? లేక కేవలం కార్యాలయ నివేదికలకే పరిమితమవుతున్నారా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.




### కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా చర్యలేంటి.?

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజా ఆస్తుల నిర్వహణపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

వార్డు కార్యాలయాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, వినియోగంలో లేని వాహనాల వివరాలు సేకరించి, వాటి పరిస్థితిపై నివేదిక రూపొందించాలి. మరమ్మతులకు అవకాశం ఉన్న వాహనాలను వెంటనే పునరుద్ధరించి, పూర్తిగా పనికిరాని వాహనాలపై నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### మున్సిపల్ శాఖలో పాలన ఉందా.?

చెత్త సేకరణ ఆటోలు మూలనపడటం చిన్న సమస్యగా కనిపించినా, దాని వెనుక ప్రజా ఆస్తుల నిర్వహణ, అధికారుల పర్యవేక్షణ, పారిశుద్ధ్య వ్యవస్థ పనితీరు వంటి అనేక అంశాలు ముడిపడి ఉన్నాయి. ప్రజాధనంతో కొనుగోలు చేసిన వాహనాలు వినియోగంలో లేకుండా పాడైపోతే అది ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతుంది. ఇప్పటికైన ఎం ఎం సి కమిషనర్, ఉన్నతాధికారులు స్పందించి జవహర్‌నగర్‌లో మూలనపడ్డ చెత్త సేకరణ ఆటోలపై పూర్తి స్థాయి తనిఖీ నిర్వహించి, ఎన్ని వాహనాలు పనిచేస్తున్నాయి, ఎన్ని మరమ్మతులకు గురయ్యాయి, ఎన్ని వినియోగంలో లేవు, వాటి నిర్వహణకు ఇప్పటివరకు ఎంత ప్రజాధనం ఖర్చు చేశారనే వివరాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588